ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, మే 26, 2026 | సంపుటి - 22 | సంచిక 237 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

అంతగా భావోద్వేగానికి

## గురికావద్దు



- కాక్రోచ్ జనతాపార్టీపై అత్యసవర విచారణ
- తిరస్కరించిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం

2

కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి సంబంధించిన పిటీషన్‌ను అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సోమవారం న్యాయవాదులనుద్దేశించి దానిపై అంత భావోద్వేగానికి గురికావద్దని ఆయన న్యాయవాదుల్ని సుప్రీం చీఫ్ జస్టిస్ కోరారు.

కాక్రోచ్ గ్రూప్‌లో అంతా

## పాకిస్తానీయులే

- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు
- తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే

6



కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు.

## పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

**అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో**



అమెరికా`ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు.

6వ పేజీలో

## నాలుగోసారి పెరిగిన పెట్రో ధరలు



- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- ఢిల్లీలో పెట్రోల్ లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20
- హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74
- విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు చేరిక

డైమండ్ హార్బర్‌లో

## బిజెపి అడుగు

**ఫల్తా గెలుపుతో టిఎంసికి బీటలు**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని భారీ కుదుపు చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉత్కంఠభరిత రీపోలింగ్‌లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయాన్ని నమోదు చేసింది.

2వ పేజీలో

## మహారాష్ట్రలో లోయలోకి దూసుకెళ్లిన స్కార్పియో ఎనిమిది మంది మృతి



ముంబై,మే25(నినాదం): మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. రాయగఢ్‌లోని అంబెనాలి ఘాట్ సమీపంలో నదీ లోయలోకి స్కార్పియో వాహనం దూసుకెళ్లిన ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను వెలికితీసేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, మిగిలిన వారికోసం గాలిస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో

## నమాజ్ నిషేధం

- అలాగే జంతు బలులు కూడా నిషిద్ధం
- అధికారులను ఆదేశించిన ఎంపి సిఎం యోగి

2

లక్నో,మే25(నినాదం): దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు.

సొంత చెల్లెలు, బావ ఫోన్లు

## ట్యాప్ చేసిన ఘనుడు

- ఇందిరమ్మ ఇళ్లు ఉంటున్న వారిని అడిగితే తెలుస్తుంది
- కెటిఆర్ సవాల్‌కు మంత్రి పొంగులేటి ప్రతిసవాల్



2

హైదరాబాద్, నినాదం: సొంత చెల్లి, బావ ఫోన్‌లు కూడా ట్యాప్ చేసిన కేటీఆర్‌కు ఇందిరమ్మ పేరు పలికే అర్హత కూడా లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై కేటీఆర్ కు మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

గోదావరి పుష్కరాలకు

## 10కోట్ల మంది



5

- అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి
- రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష

కోటి మంది మహిళను

# కోటీశ్వరులను చేస్తాం

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం

- ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్ గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి



*తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది.*

హైదరాబాద్,మే25(నినాదం): ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు.

తరువాయి 2లో..

## మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

- కనీసం 30శాతం కూడా ధాన్యం సేకరించడం లేదు
- తెలంగాణలో విద్యారంగం పటిష్టతకు కఠిన చర్యలు
- లెఫ్ట్ నేతలతో భేటీలో సిఎం రేవంత్ వివరణ
- కార్మికుల కనీస వేతనం పెంచడంపై లెఫ్ట్ నేతల అభినందన

## లారీల సమస్యతో ధాన్యం తరలింపులో ఆలస్యం

- తడిసిన ధాన్యం సైతం ప్రభుత్వం కొంటుంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి

2

## ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- మిగతా ధాన్యం కూడా కొనడానికి ప్రభుత్వం సిద్ధం
- కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు
- బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల

గత ఘటనల నుంచి

## గుణపాఠం నేర్చుకోని ఎన్‌టిఎ

- సుప్రీం ధర్మాసనం అసహనం
- నీట్ ప్రవేశ పరీక్షాపత్రం లీక్ కేసు







న్యూఢిల్లీ,మే25(నినాదం): దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యుజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ

తరువాయి 2లో..



హైదరాబాద్ మెట్రోకు

## భారీ ఆర్థిక ఊరట

**రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి ఒప్పందం**

హైదరాబాద్,మే25(నినాదం): హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరట చేకూరింది. ఇండియన్ రైల్వే ఫెనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆరఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆరఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద పక్రియ పూర్తయింది.

తరువాయి 2లో..



బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కెటిఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు.

బీఆర్ఎస్ వచ్చాక

## 24 గంటల తాగునీరిస్తాం

- ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం
- నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు ఒక్కటైనా కట్టారా
- అలా చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్,మే25(నినాదం): తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆరఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

తరువాయి 2లో..

పరస్పర అవగాహనతోటే

## కృష్ణా జలాల వినియోగం

**అంతర్‌రాష్ట్ర సమన్వయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

- తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చలలో పూర్తి ప్రాధాన్యత
- రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై కలిసిపోయే విధంగా చర్యలు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,మే25(నినాదం): నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా

తరువాయి 2లో..

## సొంత చెల్లెలు, బావ ఫోన్లు ట్యాప్ చేసిన ఘనుడవు

అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర సంవత్సరాల్లోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నాం. ఇందిరమ్మ పాలన అంటే ఏంటో గ్రామాల్లోకి వెళ్లి ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుంది కేటీఆర్ అంటూ సవాల్ చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందన్నారు. జూన్ 1న మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని మే 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించాం. రాజకీయ సన్యాసం తీసుకుంటా అంటున్న డ్రామారావు గారు... అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని ఓడగొట్టి, లోక్‌సభ ఎన్నికల్లో విOకు సున్నా సీట్లు ఇచ్చి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాల్లో కూడా మిమ్మల్ని ఓడగొట్టిన ప్రజలంతా.. వచ్చే ఎన్నికల్లో బీఆరఎస్ కు సున్నా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదు! రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదు. డబుల్ బెడ్ రూం ఇండ్లు లేని గ్రామాల్లో బీఆరఎస్ పార్టీ ఓట్లు అడగకూడదు. సవాల్‌కు సిద్ధమేనా కేటీఆర్ అని అన్నారు.

## బీఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆరఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటింటికీ మంచినీటి గోస తీర్చారని కేటీఆర్ తెలిపారు. ఏడాదిన్నరలోనే కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో 24 గంటలు మంచినీళ్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలకు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 24 గంటలు మంచినీళ్లు ఇచ్చేది కూడా కేసీఆరే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీసిందని కేటీఆర్ తెలిపారు. ఇందిరాపార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రింగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులకు బీఆరఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మళ్లీ రాబోయేది కేసీఆర్.. గులాబీ జెండానే అని చెప్పారు. బీఆరఎస్ అధికారంలోకి రాగానే మిమ్మల్ని ఆదుకుంటామని అన్నారు. సెంట్రింగ్ కార్మికులకు బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కూకట్‌పల్లిలోని 15 డివిజన్లలో కొత్త అధ్యక్షులను నియమిస్తామని కేటీఆర్ తెలిపారు. జూన్‌లో బీఆరఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కార్పొరేటర్లు నిబద్ధత కలిసిన సైనికుల్లా పనిచేశారని అన్నారు. ఎవరైతే ప్రజల చుట్టూ తిరుగుతారో.. వాళ్లకే కార్పొరేట్ టికెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. హైదరాబాద్ నగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు చూపిస్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు విసిరారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ శనివారం, ఆదివారం నాడు ఇండ్లు కూలగొట్టారని కేటీఆర్ మండిపడ్డారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ ఇంటికి హైడ్రా అధికారులు నోటీసులు అంటించారని.. ఇల్లు పోతుందనే భయంతో ఆ మహిళ ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టలేదు..



కానీ కూలగొట్టిన ఇండ్లు వేలల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటే ఇండ్లు కూలగొట్టే ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రీ అంటే ఇళ్లను కట్టాలి కానీ రేవంత్ రెడ్డి మాత్రం ఇళ్లను కూలగొడుతున్నాడని మండిపడ్డారు. దేశం మొత్తం కాంగ్రెస్ దరిద్రాన్ని వదిలించుకున్నారని.. తెలంగాణలో మాత్రం ఆ దరిద్రాన్ని తెచ్చుకున్నామని అన్నారు. దొంగ గ్యారంటీ కార్డులతో కొంప ముంచారని మండిపడ్డారు. కేసీఆర్ కల్యాణ లక్ష్మికి రూ.లక్ష ఇస్తే.. కాంగ్రెస్ వాళ్లు అదనంగా తులం బంగారం ఇస్తామని అన్నారని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ఒక్క రూపాయి అయినా పెన్షన్ పెంచిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయ్యిందని.. ఒక్కరికైనా రూ.2500 వచ్చాయా అని అడిగారు. కోడలుకు రూ.2500 ఇస్తామన్నాడని.. అత్తకు 4వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చాడని తెలిపారు. ఇలా ప్రతి వర్గానికి శఠగోపం పెట్టారని అన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారని కేటీఆర్ తెలిపారు. టీ హబ్ పేరిట డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

## అంతగా భావోద్వేగానికి గురికావద్దు

**న్యూఢిల్లీ,మే25(నినాదం):**

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ ఇటీవల నిరుద్యోగులను కాక్రోచ్‌లతో పోల్చడం, అవి కాస్తా వివాదం కావడం, వివాదాస్పద వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ వైరల్ అయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి సంబంధించిన పిటీషన్‌ను అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే న్యాయవాదులు మాత్రం ఈ పిటిషన్ విచారణకు పట్టుబడుతుండడంతో సోమవారం న్యాయవాదులనుద్దేశించి సుప్రీం చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'దానిపై అంత భావోద్వేగానికి గురికావద్దని ఆయన న్యాయవాదుల్ని కోరారు. కోర్టులో రెండు కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కోర్టు పరిశీలనలు వాణిజ్యపరంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తూ ఓ పిల్ దాఖలైంది. కాక్రోచ్ జనతా పార్టీ ప్రచారానికి సంబంధించి సిబిఐ విచారణ కోరుతూ మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ రెండు పిల్‌లపై న్యాయవాదులు కోర్టు ముందు ప్రస్తావించగా ఈ పిటిషన్లను అంత అత్యవసరంగా విచారించాల్సిన ఆవశ్యకత ఏమీ లేదని, వాటిని తగిన సమయంలో పరిశీలిస్తామని సిజెఐ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్ ఉద్యమం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని ఎన్ కె గోస్వామి అనే న్యాయవాది వాదించగా.. 'దానికంత భావోద్వేగానికి లోనుకావద్దు' అని సిజెఐ అన్నారు.



## మహారాష్ట్రలో లోయలోకి దూసుకెళ్లిన స్కార్పియో

ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, మిగిలిన వారికోసం గాలిస్తున్నారు. మహాబలేశ్వర్, పొలాద్‌పూర్ మధ్య ఉన్న అంబెనాలి ఘాట్ వద్ద ఈ ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో వాహనంలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది ప్రయాణికులు మృతిచెందినట్లు సమాచారం. నది సుమారు 500 నుంచి 700 అడుగుల లోతు వరకు ఉంటుందని అంచనా వేశారు అధికారులు. స్కార్పియో ఎస్‌యవీ సతారా జిల్లాలోని ఆస్‌గావ్‌కు ప్రాంతానికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. బాధితులంతా సతారాకు చెందినవారేనని తెలుస్తోంది. వారు దాపోలి నుంచి సతారాకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు.

## లారీల సమస్యతో ధాన్యం తరలింపులో ఆలస్యం

**హైదరాబాద్,మే25(నినాదం):**

రాష్ట్రంలో పండిన ధాన్యమంతా ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. లారీల కొరత వల్ల ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'లారీల కొరత సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇసుక లారీలు, ట్రాక్టర్లను కూడా ధాన్యం తరలింపు కోసం వాడుతున్నాం. ఈలోపు వర్షం పడి ధాన్యం తడిసినా.. ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ధాన్యం తడిసి రంగు మారినా.. కొనుగోలు చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆరఎస్, భాజపా నాటకాలు ఆడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల టన్నులనే కొనుగోలు చేస్తామని చెప్పింది. ధాన్యం కొనుగోళ్ల గురించి మాట్లాడే హక్కు భాజపా నేతలకు లేదు. రాష్ట్రంలో కోటి టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. కేంద్రం మాత్రం 52 లక్షల టన్నులకు మాత్రమే మద్దతు ధర చెల్లిస్తామని చెప్పింది.



# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బజార్లుగా, డీమార్ట్, బిగ్ బజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

### మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. కనీసం 30 శాతం ధాన్యం కూడా సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీ నేతలు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై నేతలు సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మ సీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సవి క్షిస్తున్నట్లు తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మ సీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మ సీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మ సీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరించారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వారికి వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ.. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నేతలను రేవంత్ కోరారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని.. దానిలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని తెలిపారు.

## ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

**ఖమ్మం,మే25(నినాదం):**

దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గు లేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్థితి ఉందని అన్నారు. కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆరఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. సోమవారం యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ ఎ లోరైడ్ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ ‵ ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటార్లకే పరిమితమయ్యాయని అన్నారు. దుమ్ముగూడెం శ్రీరామచంద్రుడు నడయాడిన ప్రాతంలో సీతారామ ప్రారంభించామని చెప్పుకొచ్చారు. ఆ ప్రభుత్వంలో కేవలం పంప్‌హౌస్ నిర్మాణ పనులకే పరిమితమయ్యాయని అన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు నీరు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఈ టన్నెల్ పూర్తి చేయడానికి కూడా నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల అన్నారు. ఇది తన జీవిత ఆశయమని.. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఆరునెలల్లో రాజీవ్ లింక్ కెనాల్ పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాతాలకుంట టన్నెల్‌కు అనుమతి ఇచ్చారని వెల్లడించారు. 15 నెలల్లో రెండు కిలోవి టర్ల పొడవు టన్నెల్ నిర్మాణం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు చేపట్టిన ఏజెన్సీ, అధికారులను మంత్రి తుమ్మల అభినందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని.. ఇది తన రాజకీయ కోరిక అని వ్యాఖ్యానించారు. తనను ఆశీర్వదించిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నదే తన ఆశయమని ఉద్ఘాటించారు. ఆగష్టు 15వ తేదీలోగా లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 35 సంవత్సరాల క్రితమే డొక్కా సీతమ్మ ఆక్విడెక్ట్ కట్టామని ప్రస్తావించారు. రైతుల త్యాగానికి ఫలితంగా నష్టపరిహారం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించానని తెలిపారు.

## పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం

ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా‵కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## పెట్రో ధరల భారాన్ని తగ్గించండి

**వెంటనే వ్యాట్ తగ్గించడమే పరిష్కారం**

**సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ**

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో చోద్యం చూడటం మానేసి, వెంటనే రాష్ట్ర వ్యాట్ తగ్గించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలని మాజీ మంత్రి, బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాశారు. 'పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి, రాష్ట్ర పన్నులు తగ్గించాలి'అని నాడు పీసీసీ హోదాలో ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలో ఉండి ఎందుకు వ్యాట్ తగ్గించడం లేదని లేదని నిలదీశారు. ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాటలు దంచుడు కాదు.. దమ్ముంటే మాట వి ద నిలబడి పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు దించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.వారంలో నాలుగు సార్లు ఫ్యూయల్ ధరలు పెంచి కేంద్రం ప్రజలపై పెను భారం మోపితే, మరోవైపు రేవంత్ రెడ్డి రాష్ట్ర పన్నులు తగ్గించకుండా ప్రజల నడ్డి విరిస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన సాగు ఖర్చులు భరించలేక రైతులు సతమతమవుతుంటే, మరో వైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో మ లిగే నక్కపై తాటి పండు పడ్డట్లు రైతుల పరిస్థితి తయారైందన్నారు.రవాణా రంగం తీవ్ర సంక్షోభానికి లోను కావడంతో ద్రవ్యోల్బణం పెరిగి అన్ని వర్గాల ప్రజల జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతున్నదన్నారు.పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, పన్నుల భారం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పొలం దున్నాలన్నా డీజిల్ భారం..సామాన్యుడు బైక్ తీయాలన్నా పెట్రోల్ భారం?ఆటో సోదరుడి బతుకు బండి నడవాలన్నా ఇంధన భారం.. పెరిగిన ధరలు ప్రజానీకానికి పెను శాపంగా మారిందన్నారు హరీశ్ రావు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

## డైమండ్ హార్బర్‌లో బిజెపి అడుగు

**కోల్‌కతా,మే25(నినాదం):**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని భారీ కుదుపు చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉత్కంఠభరిత రీపోలింగ్‌లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయాన్ని నమోదు చేసింది. ఈ రీపోలింగ్‌లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా ఏకంగా 1,08,000 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి సంచలనం సృష్టించారు. తృణమ ల్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలి ఏకంగా నాలుగో స్థానానికి పడిపోయింది. ఇక్కడి అభ్యర్థి పోలింగ్‌కు ముందే చేతులెత్తేశారు. విజయం సాధారణమైనది కాదు.. ఎందుకంటే ఫల్తా నియోజకవర్గం టీఎంసీ నెంబర్‵2, ఎంపీ అభిషేక్ బెనర్జీకి చెందిన 'డైమండ్ హార్బర' లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఒకప్పుడు తృణమ ల్ కాంగ్రెస్‌కు తిరుగులేని కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో కమలం వికసించడం.. బెంగాల్ రాజకీయాల్లో ఇక మమతా బెనర్జీ మార్క్ హవాకు బ్రేకులు పడ్డాయనే సంకేతాన్ని స్పష్టంగా ఇస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానానికి తొలిసారిగా ఏప్రిల్ 29న పోలింగ్ జరిగింది. అయితే ఆ సమయంలో అధికార టీఎంసీ ఈవీఎంల తారుమారుకు పాల్పడిందని, బూత్ క్యాప్చరింగ్, ఓటర్లను బెదిరించడం వంటి అక్రమాలకు ఒడిగట్టిందని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ స్థానంలో నెలకొన్న తీవ్రతను గమనించిన ఎన్నికల సంఘం (ఇఅ) అక్కడ జరిగిన పోలింగ్‌ను రద్దు చేసి, మే 21న కట్టుదిట్టమైన కేంద్ర బలగాల నిఘాలో మొత్తం 285 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించింది. ఈసారి భయం లేకుండా దాదాపు 88 శాతం మంది ఓటర్లు తరలివచ్చి ప్రశాంతంగా ఓటు వేశారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే బీజేపీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. రౌండ్ రౌండ్‌కు మెజారిటీ పెరుగుతూ పోయింది..ఈ రీపోలింగ్‌కు ముందే ఓటమిని పసిగట్టిన టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ తాను పోటీలో నిలబడనని ముఖం చాటేయడం గమనార్హం. అయితే చివరకు ఆయనకు ఈ ఎన్నికల్లో దక్కింది కేవలం 7 వేల పైచిలుకు ఓట్లే. ఈ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేకపోతున్న మాజీ సీఎం మమతా బెనర్జీ రిజల్ట్స్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ ఏజెంట్లలా నటిస్తూ కేంద్ర బలగాలు కౌంటింగ్ కేంద్రాల్లోకి దూరి ఓట్లను మళ్లీ దొంగిలించాయని అంటూ ఆమె మండిపడ్డారు. మరోవైపు ఈ ఘనవిజయంపై పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి స్పందిస్తూ.. టీఎంసీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అభిషేక్ బెనర్జీ చెప్తుండే 'డైమండ్ హార్బర్ మోడల' కాస్తా ఇప్పుడు 'తృణమ□ల్ నష్ట నమ నా'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. తాను ప్రజలను లక్ష మెజారిటీ అడిగితే.. వారు 1.08 లక్షల మెజారిటీతో నమ్మకాన్ని నిలబెట్టారని, ఫల్తా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మళ్లీ 'స్వర్ణ వైభవాన్ని' తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు.

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక ఊరట

హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎస్ రామకృష్ణ రావు తెలిపారు. హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను ఫైనాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ ఫైనాన్సింగ్ కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నారు. ఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలగనుంది. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎలఅండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుంది. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆరఎఫ్‌సీ, ఎలఅండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

## గత ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోని ఎన్‌టిఎ

ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం

ఈ మేరకు లఖ్‌నవూలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి.

## తమిళనాట అన్నా డిఎంకెకు ఝలక్

**ముగ్గరు ఎమ్మెల్యలే రాజీనామా- టివికెలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్**

చెన్నై : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకే కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో టీవీకే ప్రభుత్వానికి.. సీవీ షణ్ముగం నేతృత్వంలో 20 మందికి పైగా అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారిలో ఇప్పుడు రాజీనామా చేసిన వారు కూడా ఉన్నారు. దీంతో మదురాంతకం, ధారాపురం, పెరుందురై నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు మళ్లీ అక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. వరుసగా రెండోసారి అధికారానికి దూరం కావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది.

# తరుగు, తాలు పేరుతో రైతును మోసం చేయొద్దు!

**మిల్లర్లపై మంత్రి జూపల్లి ఆగ్రహం..!**

**ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్ కర్నూల్ మే 25 (నినాదం)**

నాగర్ కర్నూల్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ఆకస్మికంగా రైస్ మిల్లులను తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ల తో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్లు, చందుబట్ల ప్రాంతంలోని శ్రీ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్ ను సందర్శించి వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, అనల◌ోడింగ్ ప్రక్రియలను క్షేత్రస్థాయిలో మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. తనిఖీల సందర్భంగా మిల్లుల వద్ద పెద్ద సంఖ్యలో వరి ధాన్యం లోడుతో లారీలు రోజుల తరబడి నిలిచిపోయి ఉండటం గమనించిన మంత్రి అధికారులు తాలు తరుగు పేరుతో రైతులను మోసం చేయవద్దు అంటూ మిల్లర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని సమయానికి అన్‌లోడ్ చేయకుండా ఆలస్యం చేయడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని మండిపడ్డారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే ధాన్యం నిల్వలు పేరుకుపోతుండగా, మిల్లుల్లో సరైన సమన్వయం లేకపోవడం





వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని సూచించారు. రైస్ మిల్లుల యాజమాన్యాలను నేరుగా ప్రశ్నించిన మంత్రి, "ధాన్యం అన్‌లోడ్ ప్రక్రియలో ఎందుకు జాప్యం జరుగుతోంది?, రైతుల లారీలు రోజులు తరబడి ఎందుకు నిలిపివేస్తున్నారు?" అంటూ వివరణ కోరారు. రైతులపై అదనపు భారంగా మారుతున్న తాలు, తరుగు పేరుతో జరుగుతున్న అక్రమాలపై కూడా ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రైతులను మోసం చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించిన మంత్రి, ధాన్యం నిల్వలు అధికమవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులకు కూడా మంత్రి కీలక సూచనలు చేశారు. రైస్ మిల్లులు, గోదాముల వద్ద ప్రతి లారీ సమయానికి అన్‌లోడ్ అయ్యేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని ఎస్పీని ఆదేశించారు. అవసరమైతే మిల్లులు, గోదాముల వద్ద ప్రత్యేక పోలీస్ నిఘా ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి జూపల్లి, "రైతులకు నష్టం కలిగించే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోకుండా వెంటనే మిల్లులకు తరలించి అన్‌లోడ్ చేయాలి. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలను మరింత వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రికి, కలెక్టర్ తెలిపారు.రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడా నిల్వలుగా పేరుకుపోకుండా తక్షణమే రైస్ మిల్లులకు తరలించేలా అన్ని శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేసేలా జిల్లా యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, రవాణా శాఖ, మిల్లుల యాజమాన్యాల మధ్య సమయపాలన తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిల్లుల వద్ద లారీల అన్‌లోడింగ్‌లో జాప్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ కోసం తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని ప్రత్యేకంగా నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి బయలుదేరే ధాన్యం లారీ కదలికను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని, తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావుకు కలెక్టర్ వివరించారు. రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చూడటం జిల్లా యంత్రాంగం ప్రధాన బాధ్యత అని,తాలు, తరుగు వంటి అంశాల్లో పారదర్శకత కోసం స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేసే, అక్రమాలు జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని మిల్లర్లకు కలెక్టర్ హెచ్చరించారు. రైస్ మిల్లుల వద్ద నిల్వలు, అన్‌లోడింగ్ ప్రక్రియపై రోజువారీ సమీక్ష నిర్వహించి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంత్రికి, తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్ , డి.ఎస్.పి శ్రీనివాసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.





# సమతుల పోషకాహారంతోనే ఆరోగ్యం

**చిరుధాన్యాలను ఆహారంలో**

**ఎక్కువగా వినియోగించాలి**

**పిలుపునిచ్చిన అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**ఘనంగా మహిళా వారోత్సవాలు ప్రారంభం**

**గద్వాల బ్యూరో మే 25 (నినాదం)**

ప్రతి ఒక్కరూ సమతుల పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని, ఆహారంలో చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో సోమవారం న్యూట్రిషన్ గురించి ఐడిఓసి సమావేశపు మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలను, ఎక్కువ కొవ్వు, చక్కెర, ఉప్పు, నూనెలు ఉండే ఆహారాన్ని తగ్గించాలన్నారు. రోజు తగినంత నీరు తాగాలని, కృత్రిమ శీతల పానీయాలను తీసుకోవడం సరి కాదని మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ఆరోగ్యకరమైన పానీయాలను తీసుకోవాలన్నారు. శరీరానికి ఎండ తగిలితే అవసరమైనంత విటమిన్ డీ లభిస్తుందన్నారు. రోజుకు 8 గంటల నిద్ర అవసరమని, మొబైల్, టీవీలను చూడడం తగ్గించాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు యోగ, వ్యాయామం, క్రీడలు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ సెల్ జిల్లా, నగర చైర్మన్ పదవులకు దరఖాస్తుల స్వీకరణ

**నిజామాబాద్ ప్రతినిధి, మే 25 (నినాదం) :**

మైనారిటీ సెల్ జిల్లా అబ్జర్వర్ మొహమ్మెద్ మోయిన్ ఆధ్వర్యంలో మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్, నగర చైర్మన్ పదవుల కోసం ఆశావహుల నుంచి దరఖాస్తు ఫారాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ కూడా పాల్గొని మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారినే జిల్లా, నగర చైర్మన్ పదవులకు ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని, వాటిలో సమర్థులైన నాయకులను గుర్తించి బాధ్యతలు అప్పగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విపుల్ గౌడ్, కార్పొరేటర్ మనోహర్, నయీమ్, ఒబేద్, నవాజ్, అసద్, హర్షద్, ఖయ్యూమ్, జాఫర్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.



# మధిరకు ఇస్కాన్... (హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్)



**మధిర, మే 25 (నినాదం):**

మధిరకు ఇస్కాన్..(హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్) రానుంది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 12 నుండి ఇంటర్ విద్యార్థులకు కూడా ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా జిల్లాలోని 22 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్మీడియట్ కళాశాలలో చదివే 71 వేల మంది విద్యార్థులకు ఇస్కాన్ సంస్థ మధిరలో అల్పాహారం తయారుచేసి అందించనుంది. దీనికోసం తాత్కాలిక కిచెన్ ఏర్పాటు చేసేందుకు మధిర మార్కెట్ యార్డులోని గోడౌన్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు.



# ఐజ పట్టణ పలు సమస్యలపై అడిషనల్ కలెక్టర్‌కు వినతి

**గత కలెక్టర్, ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలకు, సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చిన పరిష్కారం కాని వైనం**

**గద్వాల ప్రతినిధి మే 26 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో విద్య, వైద్యం సమస్యలపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిరహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధు మోహన్ కి ప్రజా సంఘ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐజ పట్టణంలోని ప్రధాన సమస్యలను గత నాలుగు నెలల క్రితం గత కలెక్టర్ సంతోష్ గారి దృష్టికి, ఎమ్మెల్యే విజయుడు, ఎంపి డాక్టర్ మల్లు రవి దృష్టికి, మాజీ శాసనసభ్యులు సంపత్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లాం. కానీ వాటిపై ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన చెందారు. కనీసం ఈ ప్రజావాణిలోనైనా ఐజ పట్టణంలోని ప్రధాన సమస్యలపై ముఖ్యంగా విద్యా, వైద్యం గురించి మళ్లీ ఒకసారి ఆలోచన చేసి సత్వరమే సమస్యలను పరిష్కరిస్తారనే ఆశతో మళ్లీ ప్రధాన సమస్యలు ఐజ ఎస్సీ హాస్టల్ లోని మైనర్ రిపేర్లు ఐజ పట్టణంలో 30 పడకల ఆసుపత్రిని సత్వరమే ప్రారంభించుట, ఐజ పట్టణంలో మాదిగ వాడలో ఉన్న బస్తీ దావాఖాన వెంటనే ప్రారంభించుట, మాదిగ వాడలో ఉన్న స్కూల్ గత ప్రభుత్వంలో మన ఊరు మనబడి కార్యక్రమం కింద ఎన్నిక కాబడింది అయినా కూడా అభివృద్ధికి నోచుకోలేదు ఇవేకాక జోగులాంబ గద్వాల జిల్లాలో అనేక మండల కేంద్రాల్లో హాస్టల్స్, హాస్పిటల్స్ లో చాలా సమస్యలు ఉన్నాయి. కనుక దయచేసి పై సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు దండోరా ఆంజనేయులు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాష్ పాల్గొన్నారు.



# కామారెడ్డి జిల్లాలో 'డ్రంక్ అండ్ డ్రైవ్'పై పోలీసుల ఉక్కుపాదం


**73 మందికి కోర్టు శిక్షలు**

**10 మందికి జైలు శిక్షలు మరియు రూ.97,500 జరిమానా**

**కామారెడ్డి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 25 ( నినాదం )**

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడం,ప్రజల ప్రాణాలను రక్షించడం లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తోంది.కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా,మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న మొత్తం 73 మందికి కోర్టు శిక్షలు విధించడం జరిగింది.పట్టుబడిన వారిని పోలీసులు న్యాయస్థానంలో హాజరుపరచగా,కోర్టు వారికి మొత్తం రూ.97,500 జరిమానా విధించింది. అదేవిధంగా కోర్టు నలుగురికి ఒక రోజు జైలు శిక్ష, ఐదుగురుకి రెండు రోజుల జైలు శిక్ష మరియు ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.క్షణిక ఆనందం కోసం చేసే నిర్లక్ష్యం ఎన్నో కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతుందని,వాహనదారులు మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,నిబంధనలు ఉల్లంఘించి మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.కామారెడ్డి జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం ఇలాగే కొనసాగుతాయని స్పష్టం చేశారు.




# ఐకేపీ వివోఏల నిరవధిక సమ్మె ప్రారంభం

**బోధన్ ప్రతినిధి, మే25:(నినాదం )**

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బోధన్ మండల ఐకెపి వివోఏలు నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివో ఏ లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపు, అర్హులకు సీసీలుగా పదోన్నతి, 20 లక్షల రూపాయల ఆరోగ్య భీమా, ట్యాబ్,నెట్ సౌకర్యం కల్పించాలని, 58వ జీఓ ను సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

**నారాయణపేట ప్రతినిధి, మే 25, (నినాదం):**

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు-2026 కోసం, తేది 31/07/ 2026 లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి ఎల్.రాజేందర్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలబాలికలకు అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 5 నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలు అర్హులని తెలిపారు. నూతన సృజనాత్మక ఆవిష్కరణలు, పర్యావరణం, సామాజిక సేవ, (క్రీడలు, కళలు, సాంస్కృతిక కళలు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలు వంటి వాటిలో (ప్రావీణ్యం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.అభ్యర్థులు నేరుగా కాకుండా, ఆన్ లైన్ లో https://awards.gov.in అనే వెబ్ సైట్ ద్వారా తేది: 31/07/2026 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

# ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం

**జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక**

**నారాయణపేట ప్రతినిధి మే 25 (నినాదం):**



ఆడపిల్లలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం అని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ఆడపిల్లలు మంచిగా చదువుకుని తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని సమాజంలో పేరు తెచ్చుకోవాలని సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గత 15 రోజులుగా కొనసాగిన సమ్మర్ స్పార్క్ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ట్రైబల్ పెయింటింగ్/ క్రాఫ్ట్, పిక్చర్ టాక్, యంగ్ ఒరేటెడ్ సోకేజ్, కమ్యూనికేషన్ ఇంగ్లీష్, స్పీడ్ మ్యాస్ లలో జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన ప్రదర్శనలను కలెక్టర్ చూసి విద్యార్థినులను అభినందించారు. వారిలోని ప్రతిభ పాటవాలను పరీక్షించారు. రాష్ట్రస్థాయిలో కస్తూర్బా విద్యార్థులు ఇంటర్మీడియట్లో మంచి ప్రతిభ చాటారని ఆమె తెలిపారు. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి ఫలితాలలోను వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు. వాస్తవానికి వేసవి సెలవులు విద్యార్థులకు ఎంతో ముఖ్యమని, కానీ ఆ సెలవులను ఇలాంటి క్యాంప్ లలో సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఎంతో గొప్ప స్థాయికి ఎదగవచ్చని కలెక్టర్ తెలిపారు. మంచి కోర్సులలో శిక్షణ పొందిన విద్యార్థిను లు భవిష్యత్తులో మెరుగైన శిక్షణ పొందితే ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించవచ్చనీ ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో గోవింద రాజులు, డీసీ డిఓ సంగీత, ఎంఈవో బాలాజీ, సెక్టోరియల్ అధికారి నాగార్జున రెడ్డి, ఆ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 138 దరఖాస్తులు

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 25 (నినాదం)**

ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 138 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ,సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజావాణికి వచ్చిన అర్జీలలో భూ సమస్యలు,పింఛన్లు,ఉపాధి,ధాన్యం కొనుగోళ్లు, కుటుంబ సమస్యలు,సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులు ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్,ఎన్.వి గిరి,బాన్సువాడ,ఎల్లారెడ్డి ఆర్డీవోలు,జెడ్పి సీఈఓ చందర్,జిల్లా అధికారులు,వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి మహానాడు వేడుకలను ఘనంగా జయప్రదం చేయండి

**డాక్టర్ వాసిరెడ్డి రామనాథం**

**ఖమ్మం, మే 25(నినాదం ):**

ఈనెల 27న జరుగు టిడిపి మహానాడు వేడుకలను ఘనంగా జయప్రదం చేయాలని ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవన్లో ఖమ్మం జిల్లా టిడిపి ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పార్టీ జిల్లా నాయకత్వం కలిసి ఈ నెల జరగబోయే 27, 28, తేదీలో మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించింది, ఇట్టి కార్యక్రమం ఖమ్మం నగరంలోని సప్తపది (వీసీ) ఫంక్షన్ హాల్ వేదిక నిర్ణయించడం జరిగింది, అనంతరం మహానాడు సమన్వయ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. కన్నుల పండుగగా జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, కేతినేని హరీష్, కాపా కృష్ణమోహన్, కొండబాల కర్ణాకర్, వడ్డేం విజయ్, వనమా వాసు, చేకూరి చలపతిరావు, తాతా సుధాకర్, ఆర్ ఎం వరలక్ష్మి, రామయ్య, గుత్తా సీతయ్య, మీగడ రామారావు, కాట్రం స్వామి, వాసిరెడ్డి భాస్కరరావు, మల్లెంపాటి అప్పారావు, మందడపు సుధాకర్, రావుట్ల సత్యనారాయణ, పెనుగొండ ఉపేందర్, కిలారు సురేందర్, రాయల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

**మహిళా గ్రామ సంఘ భవనాలకు వర్చువల్ గా భూమి పూజ చేసిన సీఎం**

**కలెక్టరేట్ లో వీసీ ద్వారా వీక్షించిన జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు**

**గద్వాల బ్యూరో మే 25 (నినాదం)**

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలను ఇచ్చి మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చేయూతనిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులతో, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల మహిళ గ్రామ సంఘాల భవనాలకు వర్చువల్ గా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళలు తమ గ్రామ సంఘాల సమావేశాలు నిర్వహించుకునేందుకు, ఉపాధి నైపుణ్య శిక్షణకు, తయారు చేసిన వస్తువుల విక్రయాలకు ఈ భవనాలు తోడ్పడతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. వచ్చే ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల రుణాలు ఇచ్చి మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. పెట్రోల్ బంకులు, ఆర్టీసీకి అద్దెకిచ్చేందుకు బస్సుల కొనుగోలుకు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని ఫలితంగా మహిళా సంఘాల సభ్యులు మంచి ఆదాయాన్ని అర్జించవచ్చన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక కార్యక్రమాల నిర్వహిస్తోందని, అందులో భాగంగానే తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. నాణ్యమైన ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీతో మహిళ సంఘాల సభ్యులకు ఒక గుర్తింపును ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు జిల్లాల మహిళా సంఘాల సభ్యులు ప్రసంగించారు. గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో వీసీ ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.








# ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

**బోధన్ ప్రతినిధి, మే 25 (నినాదం )**

విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు సాలూరా పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది.ఈ శిబిరంలో విద్యార్థులకు కుట్లు, అల్లికలు, డ్రాయింగ్, యోగ, సంగీతం, ఇండోర్ గేమ్స్, సైన్స్ ప్రయోగాలు, శాస్త్రీయ నృత్యం, చెస్, తదితర అంశాలలో శిక్షణను ఇచ్చారు. ముగింపు సమావేశంలో గ్రామ సర్పంచ్ సోక్కం లావణ్య రవి పాల్గొని విద్యార్థులకు శిక్షణ సర్టిఫికెట్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు, డ్రాయింగ్, నృత్యాలు అందరినీ ఎంతో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజీమం జూషా, ఉపాధ్యాయులు, శిక్షణ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# గ్రామ స్వయం సహాయక సంఘ భవనాలకు శంకుస్థాపనలు చేసిన సర్పంచులు





**మధిర, మే 25 (నినాదం):**

ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత చేర్చడం కొరకు స్వయం సహాయక సంఘాల భవనాలకు శంకుస్థాపనలు చేసిన సర్పంచులు. ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం చేపట్టాలని దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయా పంచాయితీలలో గ్రామ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయాలని గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు గ్రామాలలో పండుగ వాతావరణం లో శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలలో భాగంగా రొంపి మల్ల గ్రామంలో సర్పంచ్ బాజినేని మల్లీశ్వరి ఆంజనేయులు చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగింది. అలాగే నిదానపురం గ్రామంలో సర్పంచ్ వెంపటి రత్నకుమారి రమేష్ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. అలాగే నాగవరప్పాడు గ్రామంలో భీమ బోయిన ఈశ్వరమ్మ కృష్ణ ఆంజనేయులు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. అలాగే నక్కల గరువు గ్రామంలో సర్పంచ్ సంపసాల రామకృష్ణ చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. నక్కల గరువు గ్రామంలో జరిగిన ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, ఏపీఎం కల్పన, ఉప సర్పంచ్ దేవిశెట్టి కుమారి, వెలుగు సిసి మురళి, శివకృష్ణ, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# 123 మున్సిపాలిటీల్లో 14 వందల కోట్లతో డ్రైనేజీలు

## మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి

**నెల్లూరు, మే 25 (నినాదం):**

ఏపీలోని 123 మున్సిపాల్టీల్లో రూ.14వందల కోట్లతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో పలు మున్సిపల్ స్కూళ్లను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైబ్రిడ్ ద్వారా మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో మహానాడు మాదిరిగానే తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని చెప్పారు. కచ్చితంగా కార్యకర్తలకు మాట్లాడే అవకాశం ఉంటుందని అన్నారు. నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తచరిత్ర ఎవరిదో ఏపీ ప్రజలందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. జగన్ అండ్ కో అసత్యాలు మాట్లాడేస్తే జనం నమ్మరని అన్నారు. రక్తచరిత్ర తెలుసు కాబట్టే గత ఎన్నికల్లో వైసీపీని 11సీట్లకు ప్రజలు పరిమితం చేశారని.. ఈ సారి జీరో తప్పదని హెచ్చరించారు. తమ ప్రభుత్వంపై కావాలని జగన్ అండ్ కో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎందుకు వినియోగించలేదని ప్రశ్నించారు. చివరకు స్వచ్ఛ భారత్ నిధులను కూడా వినియోగించలేదని ఆగ్రహించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, నిజాయతీగా పోస్టులు కేటాయించారని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంపై జగన్ అండ్ కో విమర్శలు చేయడం దారుణమని దుయ్యబట్టారు.

# గోదావరి పుష్కరాలకు 10 కోట్ల మంది

## అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి... రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష







**రాజమండ్రి, మే 25 (నినాదం):**

గోదావరి పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల 2027 ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలో పుష్కరాల ఏర్పాట్లపై రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి డిప్యూటీ సీఎం తెలుసుకున్నారు. ఈ క్రమంలో అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో అధికారుల పని తీరుపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో రూ.8,600 కోట్లతో చేపట్టాల్సిన పనులకు ఇంకా డీపీఆర్‌లు ఎందుకు సిద్ధం కాలేదని ప్రశ్నించారు. ఒకే సంవత్సరంలో 7 వేల పనులను ఎలా పూర్తి చేస్తారని నిలదీశారు. ముఖ్యంగా పుష్కరాల నిర్వహణలో టూరిజం శాఖ నుంచి సరైన సన్నద్ధత ఎందుకు కనిపించడం లేదని మండలించారు. ఇష్టానుసారంగా ఖర్చు పెడదామని అనుకుంటే కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వదని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో పనులు చేయాలని దిశానిర్దేశర చేశారు. హడావిడిగా పాచిపోయిన సిమెంట్‌తో పనులు చేస్తే అవి కూలిపోతాయని హెచ్చరించారు. గత పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాట వంటి ఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రికే పరిమితం కాదని, 6 జిల్లాల్లోని 274 పంచాయతీల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో భక్తులకు సమాన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పుష్కరాల పనుల సన్నద్ధతపై రాష్ట్ర కేబినెట్‌లో చర్చిస్తామని వెల్లడించారు. కేంద్ర నిధుల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వద్దకు వెళ్లే సమయంలో అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో భక్తులు మురికినీళ్లలో స్నానం చేయడం సరికాదని పేర్కొన్నారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గోదావరి పుష్కరాలను విజయవంతం చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. అలాగే, తూర్పు గోదావరి జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో గోదావరి నది కాలుష్యానికి కారణాలపై ఆరా తీశారు. క్లీన్ కృష్ణా, గోదావరి మిషన్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమ వ్యర్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదుల్లో కలవకూడదని హుకుం జారీ చేశారు. పరిశ్రమ వ్యర్థాలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలుషిత నీరు సాగునీటి కాలువల్లో కలవకుండా చర్యలు చేపట్టాలని మార్గనిర్దేశర చేశారు. మురుగునీటిని శుద్ధి చేశాకే నదులు, కాలువల్లో కలపాలని సూచించారు. మురుగునీటి హాట్ స్పాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని నిర్దేశిరచారు. కాలుష్య నివారణకు కలెక్టర్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీల్లో మురుగునీరు ఎందుకు శుద్ధి చేయట్లేదని ప్రశ్నించారు. మురుగునీటిని నేరుగా పంట కాలువల్లో ఎందుకు కలిపేస్తున్నారని నిలదీశారు. నదిలో, తాగునీటిలో మురుగునీటిని కలపడం సరికాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.P.No. 694 OF 2025

Between:
M. Sai Kumar ...Petitioner
AND
Shaik Khader Vali Shaik and others ...Respondents

To,
R-1:
Shaik Khader Vali Shaik, S/o. Abdul Waheed, Aged: 44 years, Occ: Driver, R/o. H.No. 8-10, Kothakota Village, Kurnool Rural, Kurnool District, Andhra Pradesh State-5091381
R-2:
Shaik Shaheen, W/o. Shaik Anwar Bhasha,Aged: Major, Occ: Owner, R/o. H.No. 61-15-2, VMR Road, Ramalingeswar Nagar, Vijayawada Urban, NTR, Krishna District, Andhra Pradesh State-520013.

NOTICE

Please take notice that the above Petitioners have filed the above O.P. for compensation against you and R3. Several times notices was issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on the day of 22-06-2026 for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

( BY THE ORDER OF THE COURT)
Sd/- L.R.PRAKASH,
C.D.ARUNA,
H. SHARON, M. NEERAJA,
Advocates,
H.No. 10-308/A/2, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad.
Cell: 9866611022

# స్థల వివాదాంలో జోగయ్య కుమారుడి బెదిరింపులు

## కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గేయరచయిత అనంతశ్రీరామ్

**భీమవరం, మే 25 (నినాదం):**

తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందంటూ పశ్చిమగోదావరి జిల్లా ఉన్నతాధికారులను ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ ఆశ్రయించారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా ముఖ్య కేంద్రం భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆరఎస్‌లో అనంత శ్రీరామ్ ఈ ఫిర్యాదు చేశారు. పాలకొల్లు సవిÖపం లోని యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమ ఇంటి ముందున్న ఐదు సెంట్ల ఉమ్మడి స్థలాన్ని ఆక్రమించారంటూ ఆయన తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. ఈ స్థల వివాదం ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. ఈ స్థలం కోసం మాజీ ఎంపీ హరి రామజోగయ్య కుమారుడు సూర్యప్రకాశ్ తన తల్లిదండ్రులను బెదిరింపులకు గురి చేస్తూ.. వారిని మానసికంగా హింసకు గురి చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో అనంత శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీకి అనంత శ్రీరామ్ ఫిర్యాదు చేశారు. వారికి రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను అనంత శ్రీరామ్ కోరారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

## మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన... ఇండోర్ స్టేడియంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ... ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్

**డోర్నకల్ /మరిపెడ మే 25(నినాదం)**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మరిపెడ మండల కేంద్రం లోని ఆడిటోరియంలో సోమవారం అంగన్వాడి వంట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యక్షంగా పాల్గొన్నారు.



**పోషకాహార తయారీపై ప్రత్యక్ష పరిశీలన**

అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పోషకాహార భోజనాల తయారీ విధానాన్ని ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో రిశీలించారు.వంట సామగ్రి నాణ్యత,పరిశుభ్రత,వడ్డించే విధానాన్ని ఆయన దగ్గరుండి చూశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, “పిల్లల ఆరోగ్యం,భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత.చిన్నారుల శారీరక,మానసిక వికాసానికి పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుంది.అందుకే ఎక్కడా రాజీ లేకుండా నాణ్యత పాటించాలి” అని స్పష్టం చేశారు.అంగన్వాడి టీచర్లు,ఆయాలతో ఆయన ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు,అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సిబ్బందికి సూచిం చారు. ముఖ్యంగా గర్భిణీలు,బాలింతలు,6 ఏళ్లలోపు చిన్నారులకు అందించే సేవల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులనుఆదేశించారు.



**మరిపెడ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి**

ప్రజల సంక్షేమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది.మరిపెడ మండల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.ప్రజలకు అవసరమైన విద్య,వైద్యం,పోషకాహారం వంటి ప్రతి సేవను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం” అని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెళ్లి రఘు వీరారెడ్డి,సిడిపిఓ ఎల్లమ్మ,స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రవి కుమార్,ఏసీడీపీఓ తేజ కల్యాణి,రాజలక్ష్మి, సీనియర్లు ఉషారాణి, బి.శ్రీకళ, పద్మరాణి,శాకీర్,సుధా,శ్రీలత, శ్రీదేవి, మంగదేవి, కవిత స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,అంగన్వాడి టీచర్లు,సిబ్బంది,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**లచ్చ్య తండలో మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన**

మరిపెడ మండలం లచ్య తండ గ్రామ పంచాయతీ పరిధిలో మహిళా సంఘం భవన నిర్మాణానికి తండా సర్పంచ్ గుగులోత్ సరోజ నరేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామచంద్రనాయక్ శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి 10 లక్షల రూపాయలతో గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం ఈ భవనం ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. మహిళా సంఘాలకు అవసరమైన అన్ని వసతులతో భవనాన్ని నిర్మించి, వారి కార్యకలాపాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.గ్రామీణ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం ద్వారానే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే పర్యటనపై హర్షం వ్యక్తం చేస్తూ,మండల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని కోరారు..ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి,కాంగ్రెస్ నాయకులు రవి నాయక్, అంబరీష, మేంచు అశోక్,విజయ్ నాయక్, ఎంపీడీఓ, పంచాయతీ రాజ్ ఏ ఈ, డి ఈ,ఎంపీ ఓ,గ్రామ కార్యదర్శి ఇంకా తదితరులు పాల్గొన్నారు.



**ఇండోర్ స్టేడియంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

మరిపెడ ఇండోర్ స్టేడియంలో కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబా ల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలుస్తూ కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ప థకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.ప్రతి అర్హులైన కుటుంబానికి ఈ పథకాల ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రతి పేద కుటుంబానికి భరోసాగా నిలవడమే మా బాధ్యత” అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తూ, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేస్తున్న ఎమ్మెల్యే నాయకత్వం ప్రజల్లో విశేష ఆదరణ పొందుతోంది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కృష్ణవేణి,ఆర్ ఐ శరత్ చంద్ర,మున్సిపాలిటీ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి, ప్రజాప్రతినిధులు,అధికారులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అభివృద్ధిని తట్టుకోలేక జగన్ అక్కసు

## జగన్ తీరుపై మండిపడ్డ మండిపల్లి

**అమరావతి, మే 25 (నినాదం):**

వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్టానికి హనీమూన్ నాయకుడని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభివర్ణించారు. పాత సారాని కొత్త సీసాలో నింపి మార్కెటింగ్ చేసినట్లు వైఎస్ జగన్ వ్యవహారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఓర్వలేక నిత్యం అక్కసు వెళ్లగక్కుతున్నాడంటూ జగన్‌పై ఆయన మండిపడ్డారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. విజయలక్ష్మి మినరల్స్‌తో మైనింగ్ దోపిడీ ప్రారంభించి.. భారతీ సిమెంట్స్, సండూర్ పవర్ వరకూ విస్తరించారని వివరించారు. దోపిడీ, బెదిరింపులు, మోసం చేసి.. సంపాదించిన నగదును రాజకీయాల్లో పెట్టి ఎదిగారని చెప్పారు. బలపనూరు నుంచి ప్రారంభమైన వైఎస్ కుటుంబ ప్రస్థానం రూ. లక్షల కోట్ల అవినీతి సామ్రాజ్యంగా విస్తరించిందని రవాణా శాఖ మంత్రి పేర్కొన్నారు. చెల్లని రూపాయిగా మారిన వైఎస్ జగన్‌ను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. జగన్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలంతా అసెంబ్లీకి వచ్చి మంచి సలహాలు ఇస్తే.. వాటిని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఊళ్ళో పెళ్లికి కుక్కల హడావుడి అనే రీతిలో మహానాడు ప్రారంభం రోజు వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసిందని వ్యంగ్యంగా అన్నారు.



# గంజాయి విక్రేతల పట్టివేత

**జగిత్యాల ప్రతినిధి మే 25 (నినాదం)**

జగిత్యాల రూరల్ పరిధిలోని చెల్గల్ గ్రామ పరిధిలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు నిఘా ఏర్పాటు చేసి సిసి ఎస్ పోలీసుల సహకారంతో రూరల్ పోలీసులు తనిఖీలు చేపట్టి సుమారు 1675గ్రాముల గాంజాను, రెండు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకున్నట్టు డిఎస్పీ పురుషోత్తం రెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో డిఎస్పీ మాట్లాడుతూ చల్ గల్ గ్రామంలో అనుమానస్పద స్థితిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగ గంజాయి కోసం వారు వచ్చినట్టు ఒప్పుకున్నారని, తర్వాత వీరిని విచారించగా మరో ఇద్దరు కూడా దొరికారని వారికి ఒడిశా రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తితో సంబంధాలు ఉన్నట్టు తెలిసిందని ప్రస్తుతం పరారిలో ఉన్నట్టు తెలిపారు. తాటిపాముల వంశీ పై 2025 లో ఒడిశా లోని కలిమేల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యిందని, అనిల్ పై 2025 లో ఉట్నూర్ పోలీస్ స్టేషన్లో, 2026లో సారంగాపూర్ పోలీస్ స్టేషన్లో, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయిందన్నారు.అరెస్టు చేసిన నిందితులను ఈరోజు కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కు తరలిస్తున్నట్టు డిఎస్పీ వివరాలు వెల్లడించారు. వీరిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ ఎస్సై ఉమాసాగర్, సిబ్బంది మోహన్, రమేష్, కిరణ్, శ్రీనివాస్, సురేష్, అఫ్రోజ్ లను జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి అభినందించారు.

# యర్రావారిపాలెం మండలంలో ఏనుగుల హల్‌చల్

## మామిడి వరిపంటల ధ్వంసం

**తిరుపతి, మే 25 (నినాదం):**

యర్రావారిపాలెం మండలంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. కూరపర్తి వారిపల్లి, నెరబైలు, మడిచెరువు అటవీ సమీపంలోని మామిడి తోటలు, టెంకాయ, వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. నేడు, రేపో మామిడి కాయలను మండీలకు తరలించే సమయంలో ఈ విధంగా ఏనుగులు నష్టం కలిగించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గడిచిన 4 నెలల కాలంలో సుమారు 60? వరకు అన్ని పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు ఇలా పంటలను నాశనం చేస్తూ నష్టం కలిగిస్తూ పోతే తమకు చావే శరణ్యమంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏనుగుల గుంపు నుంచి తమ పొలాలను కాపాడే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఫారెస్ట్ అధికారులను రైతులు కోరారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





**నిర్మల్ ప్రతినిధి, మే 25 (నినాదం):**

కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ను అందంగా అలంకరించాలని చెప్పారు. ప్రధాన వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల కోసం సరిపడినంత సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు.జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానిక అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇశాన్వీ నుంచి బయటకు వచ్చాం

## నోటీసులపై 27న వివరణ ఇస్తాం... విజయవాడ ఎంపి కేశినేని చిన్ని

**విజయవాడ, మే 25 (నినాదం):**



ఇశాన్వీ, కేశినేని డెవలపర్స్ సనీస్థలు కలిసి చేసిన రియల్ ఎస్టేట్ సంస్థకు ఈడీ అధికారుల నుంచి ఓ నోటీసు వచ్చిందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ఆ కంపెనీకి వచ్చిన నోటీసుపై ఈనెల 27వ తేదీన వివరణ ఇస్తామని పేర్కొన్నారు. పక్క పక్క సైట్లు ఉండటంతో రాజ్ కసిరెడ్డికి సంబంధించిన ఇశాన్వీ సంస్థతో 2021లో రియల్ ఎస్టేట్ చేసేందుకు ప్రైడ్ ఇన్‌ఫ్రా సంస్థ ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఆ సంస్థ ద్వారా రూ.35 లక్షల లావాదేవీలు జరిగాయని తెలిపారు. సోమవారం విజయవాడలో కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడారు. రాజ్ కసిరెడ్డి సంగతి తెలిశాక 2022లోనే.. ఆ కంపెనీ నుంచి బయటకు వచ్చేశామని కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఆ లావాదేవీకి సంబంధించే ఈడీ అధికారులు సమాధానం కోరుతూ నోటీసు పంపించారని వెల్లడించారు. ఆర్కిటెక్ ఫీజు కోసం చేసిన రూ.35లక్షల ట్రాన్సాక్షన్ తప్ప ఇంకేమి జరగలేదని ఈడీ అధికారులకు చెబుతామని తెలిపారు. లిక్కర్ స్కామ్‌లో తన భార్యకు నోటీసులు వచ్చినట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమని అన్నారు. అప్పుడు పెట్టిన కంపెనీలో తన భార్య ఒక డైరెక్టర్ మాత్రమేనని తేల్చిచెప్పారు. ఆ కంపెనీకి నోటీసు వచ్చిందే తప్ప.. తన భార్యకు ఎలాంటి నోటీసు రాలేదని ఎంపి కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# ఎం.ఆర్.ఓ కార్యాలయం ముందు రైతు ఆత్మహత్యాయత్నం

**భిక్కనూర్ మే 25 ( నినాదం )**





మండల కేంద్రానికి చెందిన రైతు ఆన్లైన్ చేయలేదని మన స్థాపంతో మండల రెవెన్యూ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కార్యాలయం తోటి రైతులు స్థానికులు వెంటనే అప్రమత్తమై రైతును అడ్డుకోవడంతో త్రిడిలో ప్రమాదం తప్పింది. ఉద్రిక్తత.. అధికారులపై రైతులు అగ్రహారం వివరాలకు వెళితే రైతు బోండ్ల నవీన్ వంశపరంగా(బోండ్ల కిష్టయ్య S/O రామయ్య) వస్తున్నటువంటి పట్ట భూమి సర్వే నెంబర్ 607 గల నెంబర్లో రైతుకు 1:25 గుంటల భూమి కలదు,వీరు కాస్తులో ఉండి పంట పండిస్తున్నారు, భూమి ఆన్లైన్ నమోదు కోసం గత నాలుగు సంవత్సరాల నుండి ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో విసిగిపోయిన రైతు ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన స్థానికంగా చోటు చేసుకుంది, అధికారుల నిర్లక్ష్యానికి ఘటం నిదర్శనం అంటూ స్థానికులు తోటి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, 9 నెలల నిరీక్షణ ఆరు నెలల క్రితం భూమి సర్వే కోసం చాలానా కట్టిన బాధిత రైతు, కథనం ప్రకారం తన భూమిని ఆన్లైన్లో నమోదు చేయించుకోవడానికి గత పది నెలలుగా సదరు రైతు ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ కాలార్గేల తిరుగుతున్నాడు,సర్వే చేయడానికి అధికారులు రాకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య ను వివరణ కోరగా 607 సర్వేనెంబర్ లో పూర్తి విస్తీర్ణం 13.31 ఎకరాల భూమి ఉన్నది, ఈభూమికి సంబంధించి సర్వే పూర్తి చేస్తే గాని అసలు విషయం బయటకు వస్తదని అన్నారు, త్వరలోనే ఈ సర్వే నెంబర్లు ఉన్న రైతులకు నోటీసులు అందజేస్తామని పేర్కొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ పై కలెక్టర్ కు ఫిర్యాదు

**నాగర్ కర్నూల్ మే 25 ( నినాదం)**

అనుమతి లేని మినరల్ వాటర్ ప్లాంట్ లపై ఫిర్యాదు చేసినా. పట్టించుకోవడం లేదని మున్సిపల్ కమిషనర్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు నాగర్ కర్నూల్ పట్టణంలో అనుమతి లేని,నాణ్యత ప్రమాణాలు పాటించని మినరల్ వాటర్ ప్లాంట్లపై విచారణ చేపట్టాలని స్థానిక సామాజిక ఉద్యమకారుడు వి.రాజశేఖర్ శర్మ సోమవారం రోజు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.. పట్టణంలో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని,వీటిలో చాలా వరకు ప్రభుత్వ అనుమతులు లేకుండా,కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్నాయని,నాచు పట్టిన ట్యాంకులలో నీటి నిల్వ,తుప్పు పట్టిన యంత్రాలు,ఏళ్ల తరబడి వాడుతున్న ప్లాస్టిక్ క్యాన్‌లతో ప్రజలకు స్వచ్ఛమైన నీరు పేరుతో కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారని మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ISI మార్క్,ఫుడ్ సేఫ్టీ లైసెన్స్,కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు తప్పనిసరని,అయితే చాలా వరకు ప్లాంట్లు ఈ నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయని గతంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని దీనివల్ల ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని,నాణ్యత లేని నీటితో అనేక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఈ విషయంపై జిల్లా కలెక్టర్,పట్టణ మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి,అనుమతులు లేని,నిబంధనలు పాటించని అన్ని మినరల్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి,వాటిపై కఠిన చర్యలు తీసుకుని,మూసివేసి ,ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల కోరారు.

ఎడిటోరియల్

## కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పరా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్ధకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడంలేదు.కానీ కాక్రోచ్ జనతాపార్టీ పేరుతో ఆన్‌లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ.. వస్తున్నారు. నిజంగానే ఈపార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే.. అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకలు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాంగణపరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు. అన్నా హజారానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఆయనభార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు.ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పుకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్–జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది.అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూయిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభాలో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పుదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంత వరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్న ట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పుడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.

# తెలంగాణ గానకోకిల బెల్లి లలిత

**ఆమె పాట ఒక ప్రభంజనం**
**ఆమె పాట స్వేద రక్త మిళిత నినాదం**
**ఆమె పాట అనార్తుల అర్తనాదం**
**ఆమె పాట బడుగు బలహీనుల రణభేరి**
**ఆమె పాట జాతిని జాగృతపరిచే శంఖారావం**
**ఆమె పాట తెలంగాణ గోస దరువు**
**ఆమె పాట అస్తిత్వ ఘంటారావం**
**ఆమె పాట ఆంధ్ర దోపిడి పై సింహగర్జన**
**ఆమె పాట తెలంగాణ మట్టి పొత్తిళ్ల లో పురుడు పోసుకున్న ఓ ఆయుధం.**



### బెల్లి లలిత వర్ధంతి నేడు

పాటని జీవితంగా మలుచుకుని చివరి వరకు తెలంగాణ రాష్ట్రంకోసంఉద్యమించిన తెలంగాణ గాన కోకిల బెల్లి లలిత. 1972 ఏప్రిల్ 9న భువనగిరిలో నిరుపేద కుటుంబంలో జన్మించింది. ఆమెకు ఒక అన్న ఐదు గురు సోదరీమణులు ఉన్న పెద్ద ,ఉమ్మడి కుటుంబం .ప్రాథమిక విద్య పూర్తికాకుండానే ఆమె చదువు ఆగిపోయింది. ఆమె చిన్నప్పటి నుంచి తన తండ్రితోపాటు ఒగ్గు కథలు చెప్పేందుకు వెళ్లేది .దీంతో ఆమె తండ్రి గొంతుతో గొంతు కలపటం, కాలికి గజ్జ కట్టడం సహజమైంది. చిన్నప్పుడే అనివార్యంగా బాల కార్మికురాలిగా స్పిన్నింగ్ మిల్లులో పని చేసింది. ఆ క్రమంలో ఒక కార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకొని కార్మికుల హక్కులసాధన కోసం పోరాడి సంఘం బలోపేతం కావడానికి కృషి చేసింది. అయితే తను నమ్మిన ఆకార్మిక సంఘం వ్యక్తిగత ప్రయోజనాల కోసం కార్మికులకు వెన్నుపోటు పొడుస్తుంటే సహించలేక బయటకు వచ్చి అసలైన ఉద్యమ కార్యాచరణను ఎన్ను కుంది." భువనగిరి సాహిత్య మిత్రమండలి"లో చేరి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటను అస్త్రంగా మార్చుకుంది. భువనగిరిలో నిత్య చైతన్య జ్వాలగా వెలు గొంది బస్తీలలో నీటి సమస్యను పరిష్కరించేం దుకు ఉద్యమం చేపట్టింది. మహిళలను చైతన్యపరిచి "మహిళా స్రవంతి"ని నెలకొల్పింది. యువత పెడదారి పట్టేలా చేస్తున్న గుట్కా, పాన్ పరాగ్,సారా వ్యసనాలకు వ్యతిరేకంగా ఊరూరా తన పాటలతో ప్రచారం చేసింది." వ్యభిచార నిర్మూలన కమిటీ"ని ఏర్పాటు చేసి ఆ కూపంలో నలిగిపోతున్న ఎంతోమంది వనితలకు జీవితాన్ని అందించింది .

1996లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్" తెలంగాణ ఐక్యవేదిక"ను ఏర్పాటు చేశారు. ఆ నేపథ్యంలో 1997 మార్చి 8న భువనగిరిలో జరిగిన" దగా పడ్డ తెలంగాణ" సభలో బెల్లి లలిత కీలక భూమిక పోషించింది. 1969 తెలంగాణ తొలి దశ ఉద్యమం తర్వాత కనుమరుగయ్యిందనుకున్న తెలంగాణ నినాదం ఈ సభతో ఒక్కసారిగా భగ్గున మండింది ఆంధ్ర పాలకుల వెన్నులు వణుకు పుట్టింది ఈ ఉద్యమాన్ని మొగ్గ దశలోని తుంచేయ్యాలని నాటి పాలకులు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. అయితే ఆ ప్రణాళికలను ఛేదిస్తూ 1997 ఆగస్టు 11న బహుజన నేత మారోజు వీరన్న సూర్యాపేటలో నిర్వహించిన "తెలంగాణ మహాసభ" తో పాటు 1997 డిసెంబర్ 28న వరంగల్లో జరిగిన మహాసభలో బెల్లి లలిత తన గానంతో గర్జన చేసింది ."తెలంగాణ కళా సమితి" ఏర్పాటు చేసి ఊరూరా తిరిగి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరించింది తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఉధృతం అవ్వడంతో నాటి సమైక్య పాలకులు జీర్ణించుకోలేకపోయారు. మెదక్, మహబూబ్ నగర్ సభలలో కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను పాటలు కట్టి సామాన్యుల దరికి చేర్చి, వారిని ఉద్యమంలో భాగం చేసింది. ఇలా ఐదారు జిల్లాలలో తెలంగాణ సభలు విజయవంతం కావడం లో బెల్లి లలిత కీలక పాత్ర వహించింది. తెలంగాణ సభ అంటే బెల్లి లలిత పాట తోటే ప్రారంభమయ్యే వంటి అతిశయోక్తి కాదు. బెల్లి లలిత" తెలంగాణ గాన కోకిల"గా పేరుగాంచింది.దీంతో నేరుగా తెలంగాణ ఉద్యమాన్ని, బెల్లి లలితను ఎదుర్కోలేని ప్రభుత్వం కిరాయి గుండాల పేరుతో బెల్లి లలితను భౌతికంగా లేకుండా చేయాలనే నిర్ణయించుకుంది .

1999 మే 26వ తారీకు సాయంత్రం బెల్లి లలితను అతి దారుణంగా 17 ముక్కలుగా హత్య చేయబడి, ఆ శరీరభాగాలను భువనగిరికి చుట్టుపక్కల ఉన్న బావులలో వేసి రాక్షస ఆనందం పొందారు. అంతటితో ఆగకుండా ఆమె వ్యక్తిత్వాన్ని అవమానించేలా రాజ్యం దొంగఉత్తరం సృష్టించడం వారిదుర్మార్గాలకు పరాకాష్ట. ఒక్క బెల్లి లలిత కాకుండా ఆమె కుటుంబ సభ్యులు కూడా అంతే దారుణంగా హత్య చేయబడ్డారు. బెల్లి లలితను హత్య చేయగలిగారు గాని ఆమె పాటలను హత్య చేయలేరు, నిర్జీవం చేయలేరు, కనుమరుగు చేయలేరు.నీళ్ల కోసం" తాగుబోతే నీళ్లు లేవు తుమ్మెదాలో, తడి గొంతు లారిపోయే తుమ్మెదలో" అంటూ ఆమె పాడిన పాట ఆనాటి ఈ ప్రాంత వాసులు నీటికోసం ఎన్నిఅవస్థలు పడ్డారో తెలియజేస్తుంది. "తెలంగాణ బిడ్డలారా దగా పడిన అన్నలారా హక్కులకై పోరు చేద్దామా, మనల మనం ఏలుకుందమా" అంటూ తెలంగాణ ఆవశ్యకతను ఆమె చెప్పిన తీరు ఎంతోమందిని స్ఫూర్తిదాయకమైంది. "తెలంగాణ మేలుకున్నది బంధనాలు తెంపుకున్నది" అంటూ తెలంగాణ చైతన్యాన్ని తన పాట ద్వారా అందించింది. "అడగండి అయ్యా మీరు అడగండి అయ్యా ఓట్లు అడిగే లీడర్లని అడగండయ్యా" అంటూ ఓటర్లను జాగృత పరిచి గాన కోకిల బెల్లి లలిత.


తెలంగాణ ఉన్నంతకాలం బెల్లి లలిత తెలంగాణ ప్రజల హృదయాలలో ఎల్లప్పుడూ సజీవంగా నిలిచి ఉంటుంది .

**ములక సురేష్**
**తెలంగాణ చైతన్య వేదిక**
**9441327666**



# కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే...

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు తిప్పి కొట్టిన అభిజిత్ దీప్కే







**న్యూఢిల్లీ,మే25(నినాదం):** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాల నుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరు లుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించా ల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.

# అసూయ.. అహంకారం.. అభినందన – మన ఆరోగ్యాన్ని తీర్చిదిద్దే 3భావాలు

ఈ సమాజంలో ప్రతి మనిషి ఎదగాలని కోరుకుంటాడు. కానీ కొందరు తమ ఎదుగుదల కోసం కష్టపడటంకన్నా, ఎదుట వారి ఎదుగుదలను చూసి బాధపడుతుంటారు. "అతడికి ఎందుకు పేరు వచ్చింది?", "ఆమెకు ఎందుకు గౌరవం దక్కింది?", "నన్ను ఎందుకు గుర్తించలేదు?" అనే ఆలోచనలు కొంతమందిని లోపల నుంచి కాల్చేస్తుంటాయి. మరోవైపు, కొందరు ఇతరుల విజయాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తారు. ఇంకొందరు "అన్ని నాకే తెలుసు" అనే గర్వంతో జీవిస్తుంటారు. ఈ మూడు భావాలు మన ఆరోగ్యంపైనా, మనసుపైనా, సమాజంపైనా తీవ్ర ప్రభావం చూపుతాయి.



**అసూయతో జీవించే వారి ఆరోగ్యం**
ఎదుటివారి మంచి చూసి ఓర్వలేకపోవడం అంటే మనసులో అసూయ పెంచుకోవడం. అసూయ ఒక మానసిక విషం లాంటిది. అది ముందుగా మన సును, తర్వాత శరీరాన్ని నాశనం చేస్తుంది.అలాంటి వ్యక్తుల్లో కనిపించే సమస్యలు. ఎప్పుడూ టెన్షన్, ఆందోళన రాత్రిళ్లు నిద్ర పట్టకపోవడం బీపీ, షుగర్ పెరగడం కోపం అధికం కావడం జీర్ణ సమస్యలు

**ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు వచ్చే ప్రమాదం**
ఇతరుల గురించి ఆలోచిస్తూ, తమ జీవితాన్ని మర్చిపోతారు. ఎదుటివారి విజయాన్ని చూసి బాధపడే మనిషి, తన విజయానికి దూరమవుతాడు. అసూయ మనిషిని నెమ్మదిగా ఒంటరివాడిని చేస్తుంది. ఎందుకంటే అలాంటి వ్యక్తులతో ఉండటానికి ఎవరూ ఇష్టపడరు.మంచిని ప్రోత్సహించే వారి ఆరోగ్యం, ఇతరుల విజయాన్ని చూసి ఆనందపడే మనసు చాలా గొప్పది. అలాంటి వారు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. వారి ముఖంలో సహజమైన చిరునవ్వు కనిపిస్తుంది.

**ఇతరులను అభినందించే వారికి కలిగే లాభాలు.**
మానసిక ప్రశాంతత, ఒత్తిడి తగ్గడం,మంచి నిద్ర, స్నేహాలు, మంచి సంబంధాలు పెరగడం, హృదయ ఆరోగ్యం మెరుగుప డటం, సానుకూల ఆలోచనలు పెరగడం, "బావుంది", "నువ్వు చాలా బాగా చేశావు" అని చెప్పడం వల్ల మనిషి చిన్నవాడవడు. అసలు గొప్పతనం అక్కడే కనిపిస్తుంది. ఇతరులను పైకి లేపే మనిషిని సమాజం ఎప్పటికీ గౌరవిస్తుంది."అన్ని నాకే తెలుసు" అనే హంకారం జ్ఞానం ఉన్నవాడు వినయంగా ఉంటాడు. కానీ కొందరు తాము చెప్పిందే నిజం, తమకే అన్నీ తెలుసు అని భావిస్తారు. అలాంటి అహంకారం వ్యక్తిని నెమ్మదిగా కూలదోస్తుంది.

**అహంకారంతో ఉండేవారిలో:**
కోపం ఎక్కువగా,ఒంటరితనం..ఎవరూ సలహా ఇవ్వలేరు, మానసిక ఒత్తిడి.. తప్పులు చేసినా ఒప్పుకోరు, సంబంధాలు దెబ్బతింటాయి. అహంకారం వల్ల మనిషి నేర్చుకోవడం ఆపేస్తాడు. నేర్చుకోవడం ఆగిపోయిన చోట నుంచే పతనం ప్రారంభమవుతుంది.

**సమాజానికి అవసరమైనది ఏమిటి?**
ఈరోజు సమాజంలో పోటీ పెరిగింది. సోషల్ మీడియా వల్ల ఇతరుల జీవితాలు చూసి అసూయ, పోలికలు మరింత పెరుగుతున్నాయి. కానీ మనం గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే... ఇతరుల వెలుగు చూసి బాధపడితే మన చీకటి పోదు. మన దీపం మనమే వెలిగించుకోవాలి. ఇతరులను ప్రోత్సహించే మనసు పెంచుకుంటే సమాజం ఆరోగ్యంగా మారుతుంది. మంచి మాట ఒక మందులా పనిచేస్తుంది. అభినందన ఒక మనిషికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది.

అసూయ శరీరాన్ని కాల్చే అగ్ని. అహంకారం మనిషిని ఒంటరివాడిని చేసే గోడ. అభినందన మాత్రం మనసును ఆరోగ్యంగా ఉంచే ఔషధం.మనిషి నిజమైన గొప్పతనం ఎదుటివారిని తగ్గించడం కాదు... వారిని కూడా ఎదగనివ్వడంలో ఉంది.మనసు మంచిగా ఉంటే ఆరోగ్యం మంచిగా ఉంటుంది.సమాజం కూడా సంతోషంగా ఉంటుంది.


ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170
kamareddyab@gmail.com



# తెలుగు కవిత్వంలో నిశ్శబ్ద స్వరం...ఇస్మాయిల్ కవిత్వం

### మే 26...ఇస్మాయిల్ జయంతి

తెలుగు సాహిత్యంలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించిన కవి ఇస్మాయిల్. ఆయనది ఒక అద్భుతమైన వ్యక్తిత్వం. మహ్మద్ ఇస్మాయిల్ పూర్తి పేరుతో 1928 మే 26న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించిన ఆయన, 2003 నవంబర్ 25న అనంతమైన నిశ్శబ్దంలోకి లీనమయ్యారు. కాకినాడ పి.ఆర్. కళాశాలలో తత్వశాస్త్రం లెక్చరర్‌గా, ఆ తర్వాత ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించి 1988లో పదవీ విరమణ చేశారు. ప్రభుత్వ అధికార భాషా సంఘంలో సభ్యునిగా కూడా కొంతకాలం పనిచేశారు.



ఇస్మాయిల్ వందలాది కవితా సంపుటాలను రాయలేదు గాని, తన రచనలతో తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసారు. ఆయన కవిత్వం పదాల కోసం పదాలు పెట్టడం కాదు; జీవితం, ప్రకృతి, మానవత్వం పట్ల లోతైన తాత్విక చింతన, సానుకూల దృక్పథం ప్రతిబింబించే విధంగా ఉంటుంది. సాధారణ విషయాలను, చిన్న చిన్న దృశ్యాలను, దైనందిన జీవితంలోని అనుభవాలను అద్భుతమైన పద చిత్రాలుగా మలిచే శక్తి ఇస్మాయిల్‌కు మాత్రమే చెల్లింది.

ఆయన కవిత్వంలో ప్రత్యేకత ఏమిటంటే, అది నిశ్శబ్దంలోనూ విన్న వేదన, ఆనందం, కరుణ, సౌందర్యం. కవిత్వంలో వాదాలు, సుదీర్ఘ వాక్యాలు, క్లిష్టమైన పదజాలం ఉండవు. కేవలం ఒక చిన్న అనుభూతిని సున్నితమైన పద చిత్రాలుగా రేఖీకరించడం ద్వారా పాఠకుని మనసుకు అందిస్తారు. ఆయన కవితలు చదివిన పాఠకుడు ఒక్కసారిగా ఆ దృశ్యాన్ని తన కళ్లతో చూసినట్లు అనుభూతి చెందుతాడు. ఇస్మాయిల్ జపాన్ హైకూ కవిత్వాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసిన వారిలో ప్రధానులు. ఈ పరిచయం ఆయన కవితల్లో చిన్నచిన్న చిత్రాలను సృష్టించ గలిగే సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసింది.

ఇస్మాయిల్ కవిత్వం ఒక విప్లవం. కానీ అది శబ్దాల విప్లవం కాదు. లోపల నిశ్శబ్దంగా కొనసాగే ఒక అనుభూతి విప్లవం. ఆయన కవితల్లో పదాలు కంటే వాటి వెనుక ఉన్న భావం, చింతన, ప్రకృతి, జీవితం పట్ల తాత్విక దృక్పథం ముఖ్యమైనవి. ఆయన "చెట్టు నా ఆదర్శం" అంటూ ప్రకృతి పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేశారు. "పిల్లలంత ఆనందంగా ఎందుకుంటారంటే వాళ్లు నిజమైన కవులు కాబట్టి. మనందరం పుట్టడం కవులుగానే పుడతాం" అన్న ఆయన మాటలు కవిత్వం పట్ల ఆయన వైఖరిని అద్భుతంగా వ్యక్తం చేస్తాయి.

ఇస్మాయిల్ ముఖ్య రచనలు... మృత్యువృక్షం, చెట్టు నా ఆదర్శం, రాత్రి వచ్చిన రహస్య వాన, కప్పల నిశ్శబ్దం, చిలుకలు వాలిన చెట్టు, పల్లెలో మా పాత ఇల్లు. ఆయన విమర్శా వ్యాసాలు కవిత్వంలో నిశ్శబ్దం, కరుణ ముఖ్యం ప్రత్యేక గుర్తింపును పొందాయి. మృత్యు వృక్షంకు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, కవిత్వంలో నిశ్శబ్దంకు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు లభించాయి. కళాసాగర్ వారు ఆయనకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఆయన పేరు మీద "ఇస్మాయిల్ అవార్డు" ప్రదానం చేస్తూ తెలుగు కవిత్వంలోని అతిపెద్ద రత్నానికి గౌరవం చేకూరుస్తున్నారు.

ఇస్మాయిల్ పదవులు, సన్మానాలకు దూరంగా ఉండేవారు. సాహిత్యాన్ని సామాజిక చైతన్యానికి పునాది చేయాలన్న ఆలోచనతో, ప్రకృతి, మానవ సంబంధాలను లోతుగా దర్శించిన తాత్విక కవి. ఆయన కవిత్వం కేవలం పదాల కూర్పు కాదు, అది జీవితాన్ని, మనుషుల అనుభూతులను, ప్రకృతిని ఒక కొత్త కోణంలో చూపించే అంతరాత్మ ఆవిష్కరణ. ఆయన నిశ్శబ్ద స్వరం తెలుగు సాహిత్యంలో ఒక ఎప్పటికీ నిలిచిపోయే ప్రభావాన్ని సృష్టించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...**
**9440595494**

# వినతుల పరిష్కారానికి వేగం పెంచాలి

### పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం



**కరీంనగర్, మే 25(నినాదం):** ప్రజావాణిలో స్వీకరించిన ప్రజల వినతులను అత్యంత ప్రాధాన్యంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. మొత్తం 353 దరఖాస్తులు అందగా, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# డిజిటల్ యుగంలో చేతిరాత: సవాళ్లు – ఆచరణాత్మక పరిష్కారాలు

అక్షరం అంటే నాశనం లేనిది. మనిషి తన భావాలను కలకాలం పదిలపరుచుకోవడానికి కనిపెట్టిన అద్భుతమైన సాధనం లిపి.ఆలిపికి అందమైన రూపాన్ని ఇచ్చేది చేతిరాత. ఒకప్పుడు చేతిరాతను కేవలం సమాచార మార్పిడి సాధనంగానే కాకుండా, ఒక గొప్ప కళగా, వ్యక్తిత్వానికి ప్రతిబింబంలా చూసేవారు.నేటి డిజిటల్ కాలంలో కీబోర్డ్ వినియోగం, కంప్యూటర్ అక్షరాస్యత జీవితానికి అవసరమైన సాధనాలుగా మారాయి. సాంకేతికత మన పనులకు వేగాన్ని ఇస్తున్నప్పటికీ, అక్షరాలను అందంగా దిద్దే మధురమైన చేతిరాత కళ క్రమంగా మరుగున పడుతుండటం విచారిం చదగ్గ విషయం. ఇక్కడ సాంకేతికతను నిరసించడం కంటే, దాంతో పాటుగా మన మూలాలను కాపాడుకోవడం ముఖ్యం.

**చేతి రాతపై గాంధీజీ సందేశం :**
చేతిరాత ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావిస్తూ.. "అశుద్ధమైన లేదా అస్పష్టమైన చేతిరాత అసంపూర్ణ విద్యకు సంకేతం" అని హెచ్చరించారు. విద్యార్థి దశలోనే అక్షరాలను అందంగా దిద్దడం నేర్చుకోవాలని, బాల్యంలో అలవడే గుండ్రని రాతే భవిష్యత్తు విద్యా వికాసానికి పునాది అవుతుందని ఆయన హితవు పలికారు.

**తెలుగు లిపి సౌందర్యం – ముత్యాల సరాలు:**
ప్రపంచంలోని అందమైన లిపి కలిగిన భాషల్లో తెలుగు ఒకటి. తెలుగు వృత్తాకారంలో రాయబడుతుంది కాబట్టి దీనికి గుండ్రటి ఆకృతి ఉంటుంది. తలకట్టులు, కొమ్ములు, దీర్ఘాల నిర్దిష్టమైన వంపులతో తెలుగు అక్షరాలు లయబద్ధంగా సాగుతాయి. అందుకే తెలుగు చేతిరాత చూడ్డానికి ముత్యాల సరాల కోవలా మెరిసిపోతుంది.మన పూర్వీకులు తాళపత్ర గ్రంథాల మీద ఘంటంతో రాసేటప్పుడు అక్షరం ఏమాత్రం వంకర పోయినా ఆకు విరిగిపోయే ప్రమాదం ఉండేది. అందుకే వారు అత్యంత ఏకాగ్రతతో, కళాత్మకంగా రాయడం అలవాటు చేసుకున్నారు. అచ్చు యంత్రాలు రాకముందే మన లిపి ముత్యంలా ప్రకాశించేది.

**వ్యక్తిత్వానికి, మెదడు పనితీరుకు ఉన్న సంబంధం:**
"చేతిరాతను చూసి మనిషి వ్యక్తిత్వాన్ని చెప్పవచ్చు" అంటారు పెద్దలు. దీనిని చేతిరాత విశ్లేషణ శాస్త్రం (గ్రాఫాలజీ) అని పరిగణిస్తారు. మనం అక్షరాలను రాసే తీరు, వాటి మధ్య ఇచ్చే ఖాళీలు మన ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తాయి.విజ్ఞాన శాస్త్రం ప్రకారం, మనం చేతితో రాస్తున్నప్పుడు మెదడులోని వివిధ భాగాలు చురుగ్గా పనిచేస్తాయి. కీబోర్డ్‌పై టైప్ చేయడం యాంత్రికమైనది. కానీ చేత్తో రాసేటప్పుడు కళ్లు, చేతి కండరాలు, మెదడు మధ్య లోతైన సమన్వయం అవసరమవుతుంది. చేత్తో రాసి నేర్చుకున్న విషయాలు మెదడులో ఎక్కువకాలం గుర్తుంటాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**నేటి విద్యార్థుల ప్రాథమిక సమస్యలు:**
ప్రస్తుత విద్యా విధానంలో రాత నాణ్యత కంటే వేగానికే, మార్కులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్రమైన ఆచరణాత్మక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

**అక్షర నిర్మాణ క్రమం తెలియకపోవడం:**
నేటి తరం విద్యార్థులకు ఒక అక్షరాన్ని ఎక్కడ ప్రారంభించాలో, ఎలా ముగించాలో అవగాహన లోపిస్తోంది. ఉదాహరణకు తెలుగులో 'ఓ'కు 'ఒ'కు ఉన్న తేడా, 'ఔ'కు 'జా'కు ఉన్న వ్యత్యాసం,అలాగే 'ఘ'–'ఝ','న'–'స', 'ఫ' – 'ష','భ','మ'–'య'వంటి అక్షరాల ప్రాథమిక నిర్మాణ భేదాలు తెలియక తికమకపడుతున్నారు. ఒత్తులను సరైన స్థానంలో రాయడానికి ఇబ్బంది పడుతున్నారు.

**కృత్రిమ రాత, అక్షర దోషాలు:**
అక్షరాల ఆకృతులపై స్పష్టత లేకపోవడంతో, వారు రాసే రాత ఇతరులకు అర్థం కాకపోవడమే కాకుండా, వారిలో అక్షర దోషాలు విపరీతంగా పెరుగుతున్నాయి.

**అభ్యాస పద్ధతులు లోపించడం**: పాఠశాలల్లో ఒకప్పుడు కాపీ రైటింగ్ పుస్తకాలు తప్పనిసరిగా ఉండేవి. నేడు ప్రాథమిక స్థాయిలోనే స్క్రీన్ టైమ్ పెరగడంతో పెన్ పట్టి రాసే అలవాటు క్రమంగా తప్పుతోంది.

**పునరుజ్జీవనానికి ఆచరణాత్మక చర్యలు:**
**పాఠశాల స్థాయిలో శాస్త్రీయ శిక్షణ:** ప్రాథమిక తరగతుల నుంచే అక్షరాల స్ట్రోక్స్ (ఎక్కడ మొదలుపెట్టాలి, ఎలా ముగించాలి) అనే పద్ధతిని ఉపాధ్యాయులు నేర్పించాలి. నేటి డిజిటల్ బోర్డులపై కూడా అక్షరాల అమరికను చలనచిత్రాల (యానిమేషన్) ద్వారా చూపిస్తూ సులువుగా నేర్పించవచ్చు.

**పోటీలు, ప్రోత్సాహకాలు:** విద్యార్థుల అందమైన చేతిరాతలను పాఠశాల సమాచార పలకాలపై ప్రదర్శించాలి. పాఠశాల, మండల స్థాయిల్లో చేతిరాత పోటీలు నిర్వహించి ఉత్తమ రాత కలిగిన విద్యార్థులను గుర్తించి బహుమతులు అందించాలి.

**నిత్య జీవితంలో భాగం చేయడం**: విద్యార్థులు రోజువారీ డైరీ రాయడం, ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు చేత్తో రాసిన కృతజ్ఞతా లేఖలు ఇవ్వడం, స్వయంగా సెలవు పత్రం రాయడం అలవాటు చేయాలి. పండుగలకు చేత్తో రాసిన శుభాకాంక్షల కార్డులు పంపడం వల్ల ఆత్మీయత పెరుగుతుంది.

చేతిరాత ఒక మనిషి హృదయ స్పందనకు, సృజనాత్మకతకు ప్రతీక. డిజిటల్ యుగంలో మనం ఎంత వేగంగా దూసుకుపోతున్నా, సాంకేతికతను జీవనోపాధికి వాడుకుంటూనే, మన మానసిక వికాసానికి చిహ్నమైన చేతిరాతను వదులుకోకూడదు.అక్షర సంస్కృతిని కాపాడుకోవడం అంటే మన ఆలోచనా సరళిని కాపాడుకోవడమే. గాంధీజీ అన్నట్లు, అందమైన రాతను ఒక ఆస్తిగా భావించి భావితరాలకు అందిద్దాం. అక్షరం ముత్యంలా మెరిసి, సరైన ఆకృతిని పొందినప్పుడే విద్యార్థి చదువుకు పరిపూర్ణత లభిస్తుంది.

**–మారెపల్లి అనిల్ కుమార్,**
**చేతి రాత నిపుణులు,**
**99121 62087.**



# నాలుగోసారి ... పెరిగిన పెట్రో ధరలు

### పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు




**న్యూఢిల్లీ,మే25(నినాదం):** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది.హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

### అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో


**న్యూఢిల్లీ,మే25(నినాదం):** అమెరికా–ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక్ సంబంధాల గురించి స్పందించారు. 'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో ఉన్న ప్రధాన ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు. పాక్ భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే ఇండియన్లు ఎక్కువగా మాట్లాడతారు. వారు దాని గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇరాన్ విషయంలో మధ్యవర్తిత్వం గురించి ప్రస్తావన రాలేదు. దాని గురించి వారు ఫిర్యాదు చేస్తారని నేను అనుకోను' అని రుబియో పేర్కొన్నారు. భారతదేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో అభివర్ణించారు. 'ఈ బంధం బలంగా కొనసాగుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత అమెరికా పరిపాలన ముగిసేనాటికి రెండు దేశాల మధ్య బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను' అని రుబియో అన్నారు.



# ఎండుద్రాక్షతో ఎన్నో లాభాలు!

ఆరోగ్యానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్‌లో ఎండుద్రాక్ష ఎంతో ముఖ్యమైనది. సాధా రణంగా వీటిని పాయసం, హల్వా, స్వీట్లలో ఉపయోగిస్తుంటాం. ఈ మధ్యకాలంలో వీటిని నీటిలో నానబెట్టి ఉదయాన్నే తినడం కూడా ఒక అలవాటుగా మారింది. కానీ ఆరోగ్య నిపుణుల ప్రకారం ఎండుద్రాక్షను నీటిలో కన్నా పాలలో నానబెట్టి తినడం వల్ల శరీరానికి ప్రయోజనాలు కలుగుతాయని చెబుతున్నారు. పాలు, ఎండుద్రాక్షల కలయిక శరీరానికి కాల్షియం, ప్రోటీన్, ఐరన్, ఫైబర్‌ను పుష్కలంగా అందిస్తుంది. ఇది ఎముకలను బలపరచడమే కాకుండా శరీర శక్తిని కూడా పెంచుతుంది. కాబట్టి ఈ పద్ధతి వల్ల ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో ఇక్కడ తెలుసుకుందాం..





**రక్తహీనత, రక్తపోటును నియంత్రిస్తుంది**
ఎండుద్రాక్షలో ఐరన్, పొటాషియం అధికంగా ఉంటాయి. వాటిని రాత్రంతా పాలలో నాన బెట్టడం వల్ల శరీరం వాటిలోని పోషకాలను సులభంగా జీర్ణం చేసుకుంటుంది. ప్రతి ఉదయం వాటిని తినడం వల్ల రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది.

**జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది..**
ఎండుద్రాక్షలో ఉండే పీచుపదార్థం మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. పాలలో నానబెట్టిన తర్వాత అది మెత్తబడుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభం అవుతుంది. ఖాళీ కడుపుతో ఎండుద్రాక్ష తినడం వల్ల కడుపులో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**గుండె, చర్మ ఆరోగ్యానికి మేలు**
ఎండుద్రాక్షలోని యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. అవి పొడి చర్మం, మొటిమలు, మచ్చల వంటి సమస్యలను కూడా తగ్గించి, ముఖానికి కాంతిని పెంచుతాయి.

**బరువు నియంత్రణ**
దీనిలో పీచుపదార్థం అధికంగా ఉండటం వల్ల ఈ మిశ్రమం మిమ్మల్ని ఎక్కువ సేపు కడుపు నిండినట్లుగా ఉంచుతుంది. దీనివల్ల అతిగా తినే ధోరణి తగ్గుతుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది.

అయితే ఏ ఆహారాన్నైనా అతిగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. అందువల్ల దీనిని మితంగా, వైద్యుని సలహాతో తీసుకోవడమే ఉత్తమమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



## న్యాయవాదుల భద్రతకు చట్టం కావాలి

### ధర్మపురి బార్ అసోసియేషన్ విధుల బహిష్కరణ




**ధర్మపురి, మే 25 (నినాదం):** రాష్ట్రంలో న్యాయవాదులపై పెరుగుతున్న దాడులకు నిరసనగా ధర్మపురి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమ వారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఇటీవల హైదరాబాద్‌లో సహచర న్యాయవాది కాజా మొయినుద్దీన్ హత్యకు గురైన ఘటనను ఖండిస్తూ ఆందోళన చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందెల రమేష్ మాట్లాడుతూ, న్యాయవాది హత్యకు బాధ్యులపై ప్రభుత్వం వెంటనే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును తక్షణమే అమలు చేసి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కస్తూరి శరత్ కుమార్, సీనియర్ ఈసీ సభ్యుడు రౌత్ రాజేష్, జూని యర్ ఈసీ సభ్యుడు గొంటి కిరీటి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్



**జమ్మికుంట, మే 25 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళ సంఘాలలోని సభ్యులకు, సంఘంలో లేని మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ చీరల పంపిణీ కార్యక్ర మం మరో మూడు రోజులు ఉంటుందని ఆయన తెలిపారు. మహిళలు మీ వార్డులలో పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ మాచర్ల రాజు, వార్డు ఆఫీసర్ గోపి భాస్కర్, గుంటి సాయికృష్ణ, సి ఎల్ అర్పిలు జ్యోతి, మంజుల, అర్పిలు సరళ, రజితలతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.



# పుష్కర స్నానం.. కాళేశ్వర నామ స్మరణం...

### ఐదో రోజు కొనసాగిన భక్తుల రద్దీ
### పుణ్య స్నానం ఆచరించి స్వామి వారిని దర్శించిన భక్తులు
### ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు

**భూపాలపల్లి ప్రతినిధి, మే 25(నినాదం):** హరి హర.. శివ శివ.. కాళేశ్వర ముక్తీశ్వర అంటూ భక్తులు కాళేశ్వరం త్రివేణి సంగమ తీరాన పవిత్ర సరస్వతి అంత్య పుష్కర స్నానాలు ఆచరిస్తూ ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయారు. పుష్కరాల ఐదవ రోజు సందర్భంగా త్రివేణి సంఘమం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు కాళేశ్వరం చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు.

అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదిలో స్నానం చేసిన అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, నదీమాతకు నీరాజనాలు అర్పిస్తున్నారు. యోగనంద సరస్వతి స్వామిజీ పుష్కర స్నానం ఆచరించి స్వామి వారికి అభిషేకం చేశారు. భక్తుల రద్దీ రోజు రోజుకూ పెరుగుతుం డటంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పుష్కర ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈత గాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, సింగరేణి రెస్క్యూ సిబ్బంది, బోట్లను అందుబాటులో ఉంచి భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.





**పుష్కర 5వ రోజు...**
పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యే కత ఉంటుంది. ప్రత్యేకతనను సరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొందించేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది. ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రదాయాలను కొనసాగించే వారు. పుష్కర నది తీరంలో దానం చేయాలని పురణాలు వివరించాయి. సోమవారం శివునికి ఇష్టమైన రోజు కావడంతో పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దానాలు చేయడం మంచిదని చెప్తున్నాయి. 5వ రోజైన సోమవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్ గడ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో పుష్కర స్నానం ఆచరించేందుకు భక్తులు కాళేశ్వరం చేరుకున్నారు.



**ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్లు...**
సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తులు, వినోద కార్యక్రమాలు విశేషంగా ఆకర్షణీయంగా మారాయి. పుష్కరాలకు విచ్చేస్తున్న కుటుంబాలతో పాటు వచ్చిన చిన్నారులు ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతున్నారు. ఈ వినోద కార్యక్రమాలు పిల్లలకు ఆనందాన్ని పంచడమే కాకుండా, పుష్కరాల సందడిని మరింత ఆహ్లాదకరంగా మారు మారుస్తున్నాయి. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చిన్నారుల భద్రత, సౌకర్యాల దృష్ట్యా తగిన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు వినోదాన్ని కూడా అందించేందుకు ఈ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.






# రాణించిన సూచీలు.. సెన్సెక్స్ 1,073 పాయింట్లు పైకి

దేశీయ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ట్రేడయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు తొలగిపోతాయనే అంచనాల మధ్య సూచీలు లాభాల్లో కదలాడాయి. దాంతో సెన్సెక్స్ 1100 పాయింట్లు వరకు పెరిగింది.

సెన్సెక్స్ నేటి ట్రేడింగ్‌లో 76,135 వద్ద మొదలైంది. చివరకు 1,073 పాయింట్ల లాభంతో 76,488 వద్ద ముగిసింది. నిఫ్టీ 312 పాయింట్లు ఎగబాకి, 24వేల పైన స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్, టీఎంపీవీ, లార్సెన్ షేర్లు రాణించాయి. మ్యాక్స్ హెల్త్‌కేర్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, నెస్లే, బజాజ్ ఆటో స్టాక్స్ నష్టపోయాయి.



యుద్ధం ముగించే విషయమై అమెరికా - ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 5.58 శాతం తగ్గి, 97.76 డాలర్లకు వచ్చింది. చమురు ధరలు తగ్గడంతో బ్యాంక్ షేర్లు పెరిగాయి. ఆయిల్ ధరల తగ్గుదల కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని, వడ్డీ రేట్లలో స్థిరత్వం వస్తుందని మదుపర్లు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు నేటి లాభాలకు ఓ కారణం. అమెరికా-భారత్ మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారవుతుందని ఆశిస్తున్నామని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించడం మరో కారణం. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 35 పైసలు మేర కోలుకుంది. ప్రస్తుతం 95.25 వద్ద స్థిరపడింది.

## రూపాయి విలువపై ఎలాంటి టార్గెట్ లేదు: ఆర్‌బీఐ గవర్నర్



అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు మంటలు తదితర కారణాలతో ఇటీవల మన దేశీయ కరెన్సీ రూపాయి విలువ భారీగా పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి దాదాపు 100 మార్క్ దిశగా పతనమై ఆందోళన కలిగించింది. దీనిపై తాజాగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఓవర్ వ్యాల్యూగా ఉందని అనలేమని, వాస్తవిక విలువ కంటే తక్కువగా ట్రేడ్ అవుతోందని మాత్రం చెప్పగలమని అన్నారు. ఇక, రూపాయి విలువకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట మారకపు రేటు స్థాయిని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకోదని సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. అసలు అలాంటి విషయాల్లో కేంద్రబ్యాంకు ఎలాంటి జోక్యం చేసుకోబోదని తెలిపారు. అయితే, ఊహాజనిత కదలికలు లేదా అధిక అస్థిరతను అరికట్టడానికి మాత్రమే విదేశీ మారక ద్రవ్య ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందని స్పష్టంచేశారు. మన రూపాయికి ఒక నిర్దిష్ట విలువను సెట్ చేయడం కంటే.. కరెన్సీ మార్కెట్‌ను స్థిరంగా ఉంచడానికే తాము ప్రాధాన్యమిస్తామని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు.

**విదేశీ ప్రయాణ వ్యయాలు తగ్గాయ్**
ఇక, అంతర్జాతీయంగా అస్థిరత, చమురు ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ.. మన దేశ బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ స్థిరంగా ఉన్నాయని సంజయ్ మల్హోత్రా తెలిపారు. విదేశీ సంస్థాగత మదుపర్ల నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. మన కరెన్సీ విలువను స్థిరంగా ఉంచేందుకు దిగుమతులను తగ్గించి.. ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇదిలాఉండగా.. ఇటీవల భారీస్థాయిలో పతనమైన రూపాయి విలువ సోమవారం కాస్త కోలుకుంది. నేటి ట్రేడింగ్‌లో 40 పైసలు పెరిగి 95.20గా ట్రేడ్ అవుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారయ్యే అవకాశాలున్నట్లు వార్తలు రావడంతో చమురు మంటలు కాస్త చల్లారాయి. దీంతో మన కరెన్సీ కాస్త బలపడింది.

నినాదం మార్కెట్

## మెటా నుంచి కొత్త యాప్.. రెడ్డిట్ తరహాలో ఫేస్‌బుక్ ఫోరమ్




మెటా తన యూజర్లను ఆకట్టుకోవడం కోసం ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తూనే ఉంది. ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో ఇన్‌స్టంట్ పేరుతో యాప్‌ను తీసుకురాగా.. తాజాగా రెడ్డిట్ తరహాలో ఫోరమ్ (Facebook forum) అనే స్టాండలోన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫేస్‌బుక్ గ్రూపులు, కమ్యూనిటీ యూజర్లే లక్ష్యంగా దీన్ని ప్రత్యేకంగా రూపొందించింది. నచ్చిన అంశాలపై చర్చించేందుకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది.
ప్రస్తుతం ఉన్న ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారానే ఫోరమ్ యాప్‌లోనూ లాగిన్ అవ్వొచ్చు. ఇప్పటికే ఫేస్‌బుక్ గ్రూప్ లను వాడుతున్న వినియోగదారులకు దీన్ని అందుబాటు లోకి తెచ్చింది. ఫేస్‌బుక్ గ్రూపుల్లో నిక్‌నేమ్‌తోనూ పోస్టులు చేసే సదుపాయం ఉంది. ఏదైనా కావాల్సిన అంశంపై సమాచారం తెలుసుకునేందుకు ఏఐ ఆస్క్ ట్యా బ్, ఏఐ అసిస్టెంట్ సదుపాయాన్ని కల్పిస్తోంది. ఆసక్తికర విషయాలు, స్థానిక అంశాలు, అభిరుచులు వంటి విషయాలపై గ్రూప్స్‌లో చర్చించే సదుపాయం ఉంది . ఈఫీచర్ ప్రస్తుతం అమెరికాలోని ఎంపిక చేసిన కొంత మంది ఐఓఎస్ యూజర్లకు ప్రయోగాత్మకంగా తీసుకొ చ్చింది. దశలవారీగా అందరికి అందుబాటులోకి తీసుకురానుంది.


## రికవరీ దిశలో స్టాక్ మార్కెట్లు.. నిఫ్టీ 25,000 మార్క్‌ను దాటుతుందా..?

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ సంక్షోభం కారణంగా గత కొంతకాలంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్లు తిరిగి కోలుకుంటూ 'రిలీఫ్ ర్యాలీ' దిశగా పయనిస్తున్నాయని ఎమ్‌కే ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ లిమిటెడ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ (జ×ూ) మనీష్ సొంతాలియా అభిప్రాయపడ్డారు.

నిఫ్టీ 50 నేడు 24,000 మార్కును దాటేసింది. అయితే మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు మినహా భారత మార్కెట్లు బేరిష్ (నష్టాల) వైపు వెళ్లడానికి పెద్దగా బలమైన కారణాలు ఏవీ లేవని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఒడిదుడుకులు ఎదురైనా నిఫ్టీ 22,000 మార్కును దాటి కిందకు పడిపోయే అవకాశం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఇరాన్ చుట్టూ నెలకొన్న ఉద్రిక్తతలు, విస్తృత మధ్యప్రాచ్య సంక్షోభాన్ని మార్కెట్ ఇప్పటికే అంచనా వేసిందని సొంతాలియా పేర్కొన్నారు. ఒకవేళ ఈ సంక్షోభం త్వరగా ముగిసిపోతే, కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలపై దీని ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని చెప్పారు. "మేము ఇప్పటికే దాదాపుగా ఈ త్రైమాసిక ఫలితాల ముగింపు దశకు చేరుకున్నాం. 2027 ఆర్థిక సంవత్సరం (FY27) మొదటి త్రైమాసికాన్ని పరిశీలిస్తే, నిఫ్టీ 500 ఇండెక్స్‌లోని సుమారు 44-45 శాతం కంపెనీలు తమ ఆదాయ వృద్ధి 25 శాతం కంటే ఎక్కువగా ఉండబోతోందని స్పష్టం చేస్తున్నాయి" అని ఆయన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

రివర్సల్ జోన్ ..
మిడిల్ ఈస్ట్ సంక్షోభం కారణంగా ఒకానొక సమయంలో 2027 ఆర్థిక సంవత్సర ఆదాయాలపై 10 నుంచి 12 శాతం ప్రతికూల ప్రభావం పడుతుందని మార్కెట్ భావించింది. అయితే, ప్రస్తుతానికి ఈ సంక్షోభం మరింత ఉధృతం కాకుండా అదుపులోనే ఉండటం, శాంతి ప్రయత్నాలు ప్రారంభం కావడంతో ఈ అంచనాలను సవరించాల్సి ఉంటుందని సొంతాలియా చెప్పారు. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే కంపెనీల ఆదాయ వృద్ధి అంచనాలు 12-13 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు.




మార్కెట్లో నెలకొన్న ప్రతికూలతల వల్ల కొన్ని రంగాలు తమ ప్రాథమిక విలువల కంటే చాలా కిందకు పడిపోయాయని, ఇప్పుడు జరుగుతున్న రికవరీ వాటిని మళ్లీ పుంజుకునేలా చేస్తోందని ఆయన వివరించారు. గ్లోబల్ మార్కెట్లలో మళ్లీ స్థిరత్వం వస్తోందని హర్షం వ్యక్తం చేసినప్పటికీ, కంపెనీల నుంచి మరింత బలమైన ఆదాయ ఫలితాలు రానంత వరకు నిఫ్టీ 25,000 మార్కును దాటి భారీగా లాభపడటం కూడా కష్టమేనని మనీష్ సొంతాలియా హెచ్చరించారు. కేవలం సెంటిమెంట్‌తోనే మార్కెట్ తదుపరి రికార్డులను సృష్టించలేదని, దానికి కార్పొరేట్ వృద్ధి తోడవాలని ఆయన స్పష్టం చేశారు.

# భార్యాభర్తలకు ఒకటే పాలసీ.. LIC నుంచి జాయింట్ ప్లాన్స్

**ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ూ×జ) రెండు కొత్త పాలసీలను తీసుకొచ్చింది. భార్యాభర్తలిద్దరికీ బీమా అందించేలా రెండు జాయింట్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. బీమాం పొదుపు మిళితంగా న్యూ జీవన్ సాథీ సింగిల్ ప్రీమియం, న్యూ జీవన్ సాథీ లిమిటెడ్ ప్రీమియం పేరిట రెండు పాలసీలను ఆవిష్కరించింది. జూన్ 1 నుంచి ఈ పాలసీలు కొనుగోలుకు అందుబాటులోకి రానున్నాయి.**

ఒకప్పుడు ఇంట్లో పురుషులకు మాత్రమే బీమా పాలసీ తీసుకునేవారు. చాలా కుటుంబాల్లో స్త్రీలు కూడా కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నారు. అలాంటి సందర్భాల్లో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ భార్యాభర్తలిద్దరూ కలిపి ఒకే పాలసీ తీసుకోవాలని అనుకునే వారి కోసం ఈ ప్లాన్లను ఎల్ఐసీ డిజైన్ చేసింది. బీమా హామీతో పాటు కట్టిన సొమ్ముకు గ్యారెంటీడ్ అడిషన్ (+ూ) కింద కొంత మొత్తం అదనంగా చెల్లిస్తారు. మెచ్యూరిటీ బెన్‌ఫిట్ కూడా లభిస్తుంది.

**ఎల్ఐసీ జీవన్ సాథీ**
**(సింగిల్ ప్రీమియం - 888)**
జీవన్‌సాథీ సింగిల్ ప్రీమియంతో వస్తోంది. ఇది నాన్-పార్టిసిపేట్ నాన్ మార్కెట్ లింక్డ్‌ప్లాన్.
భార్యాభర్తలకు వ్యక్తిగత జీవిత బీమాతో పాటు పొదుపు అందించడం దీని ముఖ్య ఉద్దేశం.
ఈ ప్లాన్‌లో ఒకేసారి ప్రీమియం మొత్తం చెల్లించాలి.
పాలసీ టర్మ్‌లో ప్రతి రూ.1000కు గానూ రూ.70 చొప్పున గ్యారెంటీ అడిషన్ కింద చెల్లిస్తారు.
మెచ్యూరిటీ లేదా డెత్ బెనిఫిట్ మొత్తాలను ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో తీసుకునే వీలూ ఉంది.
ఎల్ఐసీ పాలసీహోల్డర్లకు రిబేట్ లభిస్తుంది. రుణ సదుపాయం కూడా ఉంది.
ఈ పాలసీ తీసుకోవడానికి కనీస వయసు 18 ఏళ్లు దాటి ఉండాలి.
బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.3 లక్షలు, గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు.
ఆప్షన్-1 కింద ప్రీమియం మొత్తానికి 1.25 రెట్లు లేదా బేసిక్ సమ్ అష్యూర్డ్ లభిస్తుంది.
ఆప్షన్-2 కింద సింగిల్ ప్రీమియంపై 10 రెట్లు బీమా హామీ లభిస్తుంది.
**పాలసీ టర్మ్:** ఆప్షన్ 1- 10, 15, 20, 25 **సంవత్సరాలు;** ఆప్షన్ 2- 10, 15 సంవత్సరాలు.
భార్యాభర్తల్లో ఒకరికి రిస్క్ జరిగితే సమ్ అష్యూర్డ్ చెల్లిస్తారు. రెండో వ్యక్తి మరణిస్తే నామినీకి ఆ మొత్తం చెల్లిస్తారు.
**ఉదాహరణకు:** ఒక 35 ఏళ్ల భర్త (ప్రైమరీ) తన 32 ఏళ్ల భార్య (సెకండరీ)తో కలిసి Option Iని ఎంచుకుని, పాలసీ టర్మ్ 20 సంవత్సరాలు, బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.10 లక్షలతో పాలసీ తీసుకున్నారనుకుందాం. సింగిల్ ప్రీమియం కింద సుమారు రూ.8 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ఉదాహరణకు భర్తకు రిస్క్ జరిగితే ఆప్షన్ 1 ప్రకారం రూ.10 లక్షలు సర్వైవింగ్ భార్యకి చెల్లిస్తారు. పాలసీ ముమ్ముందూ కొనసాగుతుంది. భార్యకు కూడా రిస్క్ జరిగితే సమ్ అష్యూర్డ్ం అప్పటి వరకు యాడ్ అయిన గ్యారెంటీడ్ అడిషన్ కలిపి నామినీకి చెల్లిస్తారు. ఒకవేళ 20 ఏళ్లకు ఇద్దరికీ ఎలాంటి రిస్కూ జరగకపోతే బేసిక్ సమ్ అష్యూర్డ్, గ్యారెంటీ అడిషన్ కలిపి రూ.24 లక్షలు చెల్లిస్తారు. మధ్యలో ఎప్పుడైనా రుణం కూడా తీసుకోవచ్చు. యాక్సిడెంటల్, క్రిటికల్ ఇల్‌నెస్ వంటి రైడర్లు కూడా జోడించొచ్చు.




**జీవన్ సాథీ (లిమిటెడ్ ప్రీమియం- 889)**
ఇది కూడా నాన్-పార్టిసిపేట్, నాన్-లింక్డ్ ప్లాన్. 5, 10, 15 సంవత్సరాల పాటు ప్రీమియం చెల్లించాలి.
ప్రీమియం చెల్లించే కాలవ్యవధిలో మొదటి వ్యక్తికి రిస్క్ జరిగితే.. మిగిలిన ప్రీమియంలు చెల్లించాల్సిన అవసరం లేదు. పాలసీ కొనసాగుతుంది.
పాలసీ ఫోర్స్‌లో ఉన్నంత వరకు ప్రతి వెయ్యి రూపాయలకు రూ.70 చొప్పున గ్యారెంటీ అడిషన్ జోడిస్తారు.

**డెత్ బెనిఫిట్ ఆప్షన్లు:**
**ఆప్షన్1 :** బేసిక్ సమ్ అష్యూర్డ్ లేదా చెల్లించిన ప్రీమియం మొత్తం
**ఆప్షన్2 :** వార్షిక ప్రీమియానికి 10.5 రెట్లు లేదా బేసిక్ సమ్ అష్యూర్డ్
**పాలసీ టర్మ్:** 10, 15, 20, 25 సంవత్సరాలు. కనీస బీమా హామీ మొత్తం రూ.3 లక్షలు. గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు.
ఉదాహరణకు ఒక 35 ఏళ్ల భర్త, తన 32 ఏళ్ల భార్యతో కలిసి ఆప్షన్-×ని ఎంచుకుని, పాలసీ టర్మ్ 20 సంవత్సరాలు, ప్రీమియం చెల్లించే కాలవ్యవధి 10 సంవత్సరాలు ఎంచుకున్నారనుకుందాం. బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.10 లక్షలు తీసుకుంటే వార్షిక ప్రీమియం కింద ఏడాదికి రూ.1.30 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ 10 ఏళ్లలోపు భర్తకు రిస్క్ జరిగితే ఆప్షన్1 కింద డెత్ బెనిఫిట్‌ను భార్యకు చెల్లిస్తారు. మిగిలిన ప్రీమియాలు మాఫీ అవుతాయి. పాలసీ కొనసాగుతుంది. రెండో వ్యక్తికి కూడా రిస్క్ జరిగితే సమ్ అష్యూర్డ్ం గ్యారెంటీడ్ అడిషన్లు నామినీకి చెల్లిస్తారు. ఒకవేళ 20 సంవత్సరాలు పాలసీదారులకు ఎలాంటి రిస్కూ జరగకపోతే మెచ్యూరిటీ కింద సమ్ అష్యూర్డ్ రూ.10 లక్షలు, గ్యారెంటీ అడిషన్ రూ.18 లక్షలు కలిపి రూ.28 లక్షలు చెల్లిస్తారు. పాలసీ ఫోర్స్‌లో ఉన్న సమయంలో రుణ సదుపాయం ఉంది. యాక్సిడెంటల్, క్రిటికల్ ఇల్‌నెస్, టర్మ్ అష్యూరెన్స్ రైడర్స్ జోడించొచ్చు

## ఘనంగా మహిళా వారోత్సవాలు



**కొల్చారం మే 25 (నినాదం):** మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారంలో 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం మహిళల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కొల్చారం గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో కిశోర బాలికలకు, తల్లులకు పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. గర్భిణీలకు హిమోగ్లోబిన్ టెస్టుల గురించి అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చు తో అధిక పోషక విలువలు కల ఆహారపదార్ధాలను తయారు చేసి, వాటిని ఆహారంగా తీసుకోవడం వలన అనేక లాభాలు ఉన్నాయని, వారికి తెలియజేయడం జరిగింది, ఇందులో హెల్త్ సిబ్బంది హెల్త్ సూపెర్వైసోర్ మార్త, సెర్ఫ్, ఐసిడిఎస్ సువర్వైసోర్. జయంతి, అంగన్వాడీ టీచర్స్, ఉమెన్స్ హబ్ కవిత, తల్లులు, కిషోర బాలికలు, ఆశ, ఏ న్ మ్ లు పాల్గొన్నారు.

## ఆ పన్నులను ఆదుకుంటేనే... జీవితంలో సార్ధకత


### సుఖినోభవంతు ట్రస్ట్, మోహన్ చారిటబుల్ ట్రస్ట్ సేవా దృక్పథం



**జవహర్‌నగర్, మే 25 (నినాదం):** ఆ పన్నులను ఆదుకుంటేనే జీవితంలో సార్ధకత చేకూరుతుందని యువత స్వయం ఉపాధిలో రాణించాలని ట్రస్ట్ చైర్మన్ రత్నప్రభ పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ భాను రెడ్డిలు తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ లో ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న నిరుపేద దివ్యాంగ యువతి వరలక్ష్మికి స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో సోమవారం కిరాణా షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా సుఖినోభవంతు ట్రస్ట్ చైర్మన్ రత్నప్రభ, భాను రెడ్డిలు మాట్లాడుతూ గతంలో ట్రస్ట్ పేదలకు కుట్టు మిషన్లు రైస్ బ్యాగులు వికలాంగులకు వీల్ చైర్లు విద్యార్థులకు పుస్తకాలు అందించడంతోపాటు నిరుపేద కుటుంబాలకు వివాహాలు తేదింటి ఆడపిల్లలకు పుస్తె మట్టెలు తదితర ఎన్నో పుణ్యకార్యాలు చేసిన ఘనత ఈ ట్రస్ట్ కు ఉందని తెలిపారు. వికలాంగుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ సహకారంతో 20వేల రూపాయల విలువైన కిరాణా సామాగ్రిని వరలక్ష్మికి అందించి జీవనోపాధి కింద కిరాణా షాపును ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుఖినోభవంతు ట్రస్టు సభ్యులు సత్యవతి వెంకటరమణ పాత్రికేయులు విజయకుమార్ రఘు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్

### ఎమ్మెల్యే కాలె యాదయ్య



**వికారాబాద్, మే 24(నినాదం):** అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆత్మవిశ్వాసం నింపుతుందని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం నవాబుపేట మండల కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ 21 మందికి 8. 42 లక్షల విలువ గల చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ మీతోనే ఉండటం మా బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీ ఏ సి ఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, ఏ ఎం సి చైర్మన్ గీతాసింగ్, నాయకులు వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి, ఖదీర్, రాములు, లింగం, రంగారెడ్డి, కార్యకర్తలు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

### మంత్రి కొండా సురేఖ

### పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్

### మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, మే 25 (నినాదం):** అడవుల నరికివేత, పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి





మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టి జి ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను



పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, మరియు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటాను





### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, మే25 (నినాదం):** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగానికి కీలకంగా మారిన సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో నియోజకవర్గస్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులు చేయాలని కోరారు. సంఘం సభ్యుల కోరిక మేరకు.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి ఆరోగ్య భద్రతను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి సెంట్రింగ్ కార్మికుడికి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు.. లేనివారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, రాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు యాదగిరి, అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంగయ్య పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

### అడిషనల్ కలెక్టర్ సంగీత



**సంగారెడ్డి బ్యూరో, మే 25 (నినాదం):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 07, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యంఎ ఖలీల్‌కు పరామర్శ



**ఆమనగల్లు మే, 25 (నినాదం):** ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యంఎ ఖలీల్ ను మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము పరామర్శించారు. సోమవారం కడ్తాల లోని తన ఖలీల్ నివాసానికి ఆమనగల్లు స్థానిక నేతలతో తో కలిసి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధైర్యంగా ఉండాలని త్వరగా కోలుకుంటారని రాము మనో ధైర్యం చెప్పారు.

## అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు మంచిది కాదు





### ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలి

### హమాలీలు, లారీల కొరత నివారించాలి

### జిన్నారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్చెరు, మే25(నినాదం):** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. వర్షాకాలం ఆరంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికీ ధాన్యం కొనుగోలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తుందని. అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని.. వెంటనే కొనుగోళ్ళు ప్రారంభించాలని పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిన్నారం, సోలక్పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల అంశంలో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు వివరించారు. కష్టనష్టాలను ఎదుర్కొని ధాన్యం పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వస్తే.. అధికారుల నిర్లక్ష్యం మూలంగా గత 15 రోజులుగా కొనుగోలు చేయకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షాలు ఎప్పుడు వస్తాయన్న భయాందోళనతో ప్రతిరోజు ధాన్యాన్ని కాపాడుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత పది సంవత్సరాల పాటు రాష్ట్రంలోని రైతాంగానికి స్వర్ణయుగం నడిచిందని అన్నారు. రైతుకి రైతుబంధు, రైతు భీమా, సాగునీరు, పండించిన ప్రతి పంటకు మద్దతు ధర, సకాలంలో కొనుగోళ్లు చేయడంతో పాటు వెంటనే డబ్బులు సైతం డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో వ్యవసాయం అంతంత మాత్రమే ఉందని.. పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మరో వారం రోజుల్లో రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం ఆసన్నమైనప్పటికిని.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు అలాగే ఉండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అర్థం పడుతుందని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న కంట కన్నీరు ప్రభుత్వానికి మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు. రవాణా, హమాలీలు, గన్ని బ్యాగుల కొరత పేరుతో రైతులను ఇబ్బందులకు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రోజు నుండే ధాన్య కొనుగోలు చేపట్టాలని జిల్లా పౌరసరఫల శాఖ అధికారికి ఫోన్ లో సూచించారు. రాబోయే రెండు రోజుల్లో నియోజకవర్గంలో రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయడంతోపాటు.. ఇందుకు సంబంధించిన డబ్బులు సైతం డిపాజిట్ చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. లేనిపక్షంలో రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముంపు రహిత ప్రాంతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్, మే 25 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 - సుభాష్ నగర్ డివిజన్ గంపల బస్తీలో పర్యటించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద నిర్మాణంలో ఉన్న నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలాల నిర్మాణం ద్వారా వర్షాకాలంలో ముంపు తీవ్రతను తగ్గించడంతో పాటు వేగవంతమైన అభివృద్ధి సాధ్యమన్నారు. ఇప్పటికే నాలాల అభివృద్ధి దాదాపు నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలలో పూర్తయిందని, గత పన్నాండేళ్ల కాలంలో ప్రణాళిక బద్ధంగా నాలాలను అభివృద్ధి పరిచామని పేర్కొన్నారు. పూర్తిస్థాయి నాలాల అభివృద్ధి ద్వారా "జీరో - ముంపు రహిత ప్రాంతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు. నాలా నిర్మాణ పనులలో పర్యవేక్షణ, పనుల్లో అలసత్వం తీరుపై అధికారులపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విస్తరణ పనులతో పాటు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ లావణ్య, ఇంజనీరింగ్ ఎస్.ఈ సక్కు భాయ్, వివిధ



విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, గుబ్బల లక్ష్మీ నారాయణ, అడప శేషు, దుర్గా రావు, రంగా, వెంకట్ రెడ్డి, రఘు శంకర్, ప్రసాద్, మణికంఠ, నదీమ్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ ఫీజులు



**వికారాబాద్, మే 25(నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ నెల 28 నుండి రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు భారీగా పెరగనున్నాయని ప్రాథమిక సమాచారం. అదేవిధంగా హెచ్ ఎం డి ఏ పరిధిలో విలీనం చేసిన భూముల విలువలు మూడిం తలు పెరగనున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా అధికంగా పెరగనున్నాయి. ప్రస్తుతం ఆయా మండలాల్లో భూముల విలువలు భిన్నంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న భూమి విలువకు రెండింతలు విలువ పెరగనున్నాయి. జిల్లాలో పరిగి,నవాబుపేట, పూడూరు, వికారాబాద్,మండలాలకు చెందిన పలు గ్రామాలు హెచ్ ఎం డి ఏ పరిధిలోకి చేర్చారు. అదేవిధంగా ఇటీవల మోమిన్ పేట మండలం ఎన్కతల, టేకులపల్లి, గ్రామాలను నవాబుపేట మండలం చిట్టిగిద్ద, యాపూర్ గ్రామాలను కూడా హెచ్ ఎం డి ఏ పరిధిలోకి చేర్చడంతో ఈ గ్రామాలకు చెందిన రెవెన్యూ భూముల విలువలు ప్రస్తుతం ఉన్న విలువతో మూడు రేట్లు అధికంగా పెరగనున్నాయిని తెలుస్తోంది. హెచ్ ఎం డి ఏ పరిధిలో దాదాపు పది లక్షల వరకు భూమి విలువ పెరగనునందని ప్రాథమిక సమాచారం. దీంతో ఎకరం రిజిస్ట్రేషన్ ఫీజు దాదాపు లక్ష రూపాయల వరకు ఉండవచ్చని పరిశీలకులు అంచానా వేస్తున్నారు. పెరిగిన భూముల విలువలను ఈ నెల 28 నుండి అమల్లోకి రానున్నాయని తెలుస్తోంది.

## జిన్నారం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**పటాన్చెరు, మే25 (నినాదం):** జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్, రాళ్లకత్వ, రాళ్లకత్వ తండా, సోలక్పల్లి, అండూర్, ఇమామ్ నగర్, ఊట్ల, దాదిగూడెం, మంగంపేట, జిన్నారం, జంగంపేట, కొడకంచి, నల్తూరు, కొర్లకుంట వార్డుల్లో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. నూతనంగా ఏర్పడిన జిన్నారం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు.

## మజ్జిగ తాగండి - ఆరోగ్యంగా ఉండండి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 25 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 130 - సుభాష్ నగర్ జీడిమెట్ల బస్ డిపో వద్ద బిఆర్ఎస్ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి తాపాన్ని తగ్గించుకొనుటకు దాహం తీర్చుకొనుటకు పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేయడం మాధవ సేవతో సమానమని అన్నారు. ఎండలో వెళ్లే ప్రయాణికులు పాదచారులు వాహనదారులు విధిగా మజ్జిగ తాగి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, గుబ్బల లక్ష్మీ నారాయణ, కట్ట సుందర్ బాబు, కట్ట సుకుమార్, ప్రేమ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిగి వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ బృందం

**వికారాబాద్, మే 24(నినాదం):** రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ రాష్ట్ర బృందం జిల్లా పరిధిలోని పరిగి వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో రైతన్నలతో ముఖాముఖి మాట్లాడారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు, మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని నిలువునా దగా చేసిందని దుయ్యబట్టారు . నేడు రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతన్నలు కొనుగోలు కేంద్రాల వద్ద వారాల తరబడి పడిగాపులు కాయాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కనీస ముందస్తు ప్రణాళిక లేకపోవడం, సకాలంలో ధాన్యం సేకరించడంలో ఘోర వైఫల్యం కారణంగా నేడు తెలంగాణ వ్యాప్తంగా వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసన మండలిపక్ష నేత ఏవిఎన్ రెడ్డి, ఎంపీలు, కొండ విశవేశ్వర్ రెడ్డి, డికె అరుణ, ఈటల



రాజేందర్, మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, పైడి రాకేశ్ రెడ్డి, డా. పాల్వాయి హరీశ్ బాబు, ధన్ పాల్ సూర్యా నారయణ గుప్త, రామారావు పటేల్, ఎమ్మెల్సీలు, మల్క కొమరయ్య, సి. అంజి రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య, బీజేపీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద రావు, బిజెపి పరిగి అసెంబ్లీ ఇంచార్జ్, మారుతి కిరణ్ బూనేటి పాల్గొన్నారు.



## వార్డుల్లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ..

**జమ్మికుంట, మే 25 (నినాదం) :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో గల ఒకటో వార్డు రెండో వార్డు లో ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. దుబ్బ మల్లన్న స్వామి ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి రెండో వార్డ్ కౌన్సిలర్ పోలేని శిల్ప వేణు రావు చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో కౌన్సిలర్ ఎండి ఫెరోజ్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఇంటికి ఇల్లాలు దీపమని మహిళా ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బాగుంటుందని ఆరోగ్య విషయంలో మహిళలు జాగ్రత్త తీసుకోవాలని వారు సూచించారు. మహిళా ఆరోగ్యం తోనే ఆరోగ్య సమాజం నిర్మించబడుతుందని ఆరోగ్యశాఖ వారు నిర్వహించే వైద్య పరీక్షల్లో మహిళలు పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వం అందించిన చీరలు మహిళలు తీసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**హుజురాబాద్, మే 25 (నినాదం):**

ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం హుజురాబాద్ మున్సిపల్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని , మున్సిపల్ కమిషనర్ కిషన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ, మహిళా సంఘాల ఏర్పాటు, ఇందిరా మహిళా శక్తి లోన్ మేళా, ఉద్యమి రిజిస్ట్రేషన్, ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం, ప్రాంతీయ స్థాయి సమాఖ్య, పట్టణ స్థాయి సమాఖ్య జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, సంఘాల బలోపేతం లక్ష్యంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. జనరల్ బాడీ మీటింగ్ అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సంఘ సభ్యులకు చీరలను అందజేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్, వార్డ్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మెప్మా డిపార్ట్మెంట్ అధికారులు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## 29 అంశాలకు కౌన్సిల్ గ్రీన్ సిగ్నల్

- వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సభ్యుల డిమాండ్
- దశలవారీగా పనులు చేపడతామన్నచైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి...

**మెట్ పల్లి, మే 25 (నినాదం)**

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో 29 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణ అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల్లో అవసరమైన ప్రాంతాల్లో వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, డీఈఈ నాగేశ్వరరావు, మేనేజర్ వెంకటలక్ష్మి, టీపీఓ రాజేంద్రప్రసాద్, ఆర్ఓ మిర్జా అజ్మతుల్లా బేగ్, జేఏఓ రమేష్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీతో జీలుగ విత్తనాలు..

### ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు



**జమ్మికుంట, మే 25 (నినాదం)**

ఇల్లంతకుంట మండల పరిధిలోని రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు సబ్సిడీపై అందిస్తున్నారని అవసరం ఉన్నటువంటి రైతులు కొనుగోలు చేయాలని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానశీ చైర్మన్ ఇంగిలే రామారావు రైతులను కోరారు. జీలుగ బస్తా మొత్తం ధర 4905 రూపాయలు 50% సబ్సిడీ పోను 2452.50 అందిస్తున్నారని తెలిపారు. జీలుగ విత్తనాలను వరి పొలం నాటు వేసే ముందు చల్లుకొని అవి పెరిగిన తర్వాత దున్ని నాటు వేసినట్లయితే వరి అధిగ దిగుబడిని పొందవచ్చునని అన్నారు. జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీ తీసుకొని ఇల్లంతకుంట లోని డీసీఎంఎస్ కాంప్లెక్స్ లక్ష్మన్నపల్లి 200 బ్యాగులు, రాచపల్లి 200 బ్యాగులు, మల్యాల133 బ్యాగులు సిరిసేడు 200 బ్యాగులు దాదాపు మొత్తం 930 బస్తాలు ఈ పై గ్రామాలలో జీలుగు బత్తాలు అందుబాటులో ఉన్నవి. 50% సబ్సిడీతో ఒక బస్తా 30 కిలోల బ్యాగు 2452 రూపాయలుగా ధర నిర్ణయించడం జరిగింది. ఒక బస్తా దాదాపు రెండున్నర ఎకరాలకు సరిపోతుంది. జీలగ విత్తనాలను చల్లడం ద్వారా పచ్చిరొట్ట ఎరువు లాగా పని చేస్తుందని అలాగే పంట దిగుబడి ఎక్కువ వస్తుందని అన్నారు. జీలుగు విత్తనాలను రైతులకు సరఫరా చేయడంలో వ్యవసాయ అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారని తెలిపారు. రైతులకు ఎలాంటి అవసరాలు ఉన్న సంబంధిత వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ ని సంప్రదించాలన్నారు.

## నగరపాలక సంస్థ ప్రజావాణికి 23 వినతులు

**కరీంనగర్, మే25(నినాదం)**




కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజావాణి" కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన ప్రజల నుంచి మొత్తం 23 వినతులు అందాయి. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్వయంగా దరఖాస్తులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన వినతుల్లో పట్టణ ప్రణాళిక విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 5, పారిశుధ్యానికి 4, పెన్షన్‌కు 3, ఇంజినీరింగ్‌కు 1, స్థాపన విభాగానికి 1 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ప్రజల సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హమైన వాటిని వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులను సంబంధిత విభాగాల అధికారులకు అప్పగించి, ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, ఉప కమిషనర్ బషీరొద్దీన్, సహాయ కమిషనర్ శ్రీధర్, సూపరింటెండెంట్ సునీల్, షాహిదా, పశువైద్య అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఆరోగ్య అధికారి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై

# కాంగ్రెస్ నిరసన

- ఇందిరా చౌక్‌లో ఆటో లాగుతూ వినూత్న ఆందోళన.. ధరలు తగ్గించాలంటూ కేంద్రానికి హెచ్చరిక
- చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం



**కరీంనగర్, మే 25(నినాదం)**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కరీంనగర్‌లో యువ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. యువ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. నిరసనలో భాగంగా నాయకులు ఆటో రిక్షాకు తాడు కట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు.

పెరుగుతున్న ఇంధన ధరలతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, నెలరోజుల్లో పలుమార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతోంద న్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నా యని విమర్శించారు. గత ప్రభుత్వ కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధికంగా ఉన్నప్పటికీ ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

ఇప్పటికైనా పెంచిన ఇంధన ధరలను తగ్గించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ఆకుల నరసయ్యతో, కోమిటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, యువ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖాజా మొయినుద్దీన్ హత్యపై

# కోరుట్ల బార్ అసోసియేషన్ నిరసన



**మెట్ పల్లి మే 25(నినాదం)**

ఖాజా మొయినుద్దీన్ హత్యను నిరసిస్తూ సోమవారం కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట ఆందోళన చేపట్టారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో శనివారం దుండగులు కారుతో ఢీకొట్టి ఆయనను హత్య చేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా న్యాయవాదులు నినాదాలు చేస్తూ ఘటనపై తీవ్ర ఖండన తెలిపారు. అనంతరం ఖాజా మొయినుద్దీన్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదులకు రోజురోజుకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ప్రత్యేక న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఖాజా మొయినుద్దీన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తూ, ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కస్తూరి రమేష్, కొంపల్లి సురేష్, గోసికొండ సురేష్, గాంధారి శ్రీనివాస్, చిలువేరి రాజశేఖర్, పూరడి నరేందర్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్లపై

### టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతోనే విచ్చలవిడిగా అక్రమ వెంచర్లు

# బీజేపీ కౌన్సిలర్ల ఆగ్రహం

- అక్రమ లేఅవుట్లతో ప్రభుత్వ ఆదాయానికి నష్టం.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్...




**మెట్ పల్లి మే 25 (నినాదం):**

పట్టణంలో టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమ లేఅవుట్లు విచ్చలవిడిగా పెరుగుతున్నా యని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూములను అక్రమంగా లేఅవుట్లుగా మార్చి విక్రయాలు నిర్వహిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై వెంటనే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌లకు సంయుక్తంగా వినతిపత్రం అందజేశారు. 26వ వార్డు కౌన్సిలర్ బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో 15వ వార్డు కౌన్సిలర్ అరిగెల అనూష-రాకేష్, 16వ వార్డు కౌన్సిలర్ అరిసె వనజ-మురళి, 9వ వార్డు కౌన్సిలర్ బొడ్ల వసుధ-నాగేష్ కలిసి ఫిర్యాదు చేశారు. బచ్‌పన్ స్కూల్ సమీపంలోని సర్వే నంబర్లు 983, 984, 985, 1001 ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. దానవేణి అలియాస్ కలర్స్ గంగాధర్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి చుట్టుపక్కల భూములను కొనుగోలు చేసి, రహదారులు, డ్రైనేజీలు, లింక్ రోడ్లు వంటి కనీస సౌకర్యాలు లేకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ లేఅవుట్ల వల్ల సమీప రైతులు, భూస్వాములు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం, అక్రమ వెంచర్లపై సమయానికి చర్యలు తీసుకోకపోవడం వల్లే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు మండిపడ్డారు. కొందరు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా పక్కన పడుతున్నాయని ఆరోపించారు. అక్రమ లేఅవుట్ల కారణంగా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం దెబ్బతింటోందని, ప్రభుత్వానికి భారీగా నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయక ప్రజలు ఇలాంటి అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోకుండా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అక్రమంగా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను వెంటనే తొలగించి, సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి పట్టణంలో మరెన్నో అక్రమ లేఅవుట్లు కొనసాగుతున్నాయని, వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమగ్ర విచారణ చేపట్టాలని కౌన్సిలర్లు కోరారు.

## వడదెబ్బతో మహిళ మృతి



**జమ్మికుంట, మే 25 (నినాదం)**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన దాసరపు కాంతమ్మ(59), అనే మహిళా వడదెబ్బతో మృతి చెందింది. గత మూడు రోజుల క్రితం ఇంటి నుండి బయటకు వెళ్లి వచ్చిన తరువాత నుండి వాంతులు విరోచనాలు కావడంతో పాటు తీవ్ర అస్వస్థతకు గురైంది. తీవ్రంగా అస్వస్థతకు గురైన కాంతమ్మ ను ఆసుపత్రికి తీసుకుని వెళ్లి సోమవారం మృతి చెందినట్లు కుమారుడు దాసరపు వాసు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు.

## ముఖ్యమంత్రిని కలిసిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి

### నిబద్ధతతో పనిచేయాలని సీఎం సూచన



**కరీంనగర్, మే25(నినాదం):**

మునూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, తనపై విశ్వాసం ఉంచి కార్పొరేషన్ చైర్మన్ పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మునూరుకాపు సామాజిక వర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని, కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరేలా చిత్తశుద్ధితో సేవలందించాలని సూచించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.. అపోహలకు గురికావద్దని రైతులకు సూచన
- కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న



**కరీంనగర్, మే25(నినాదం)**

కరీంనగర్ మార్కెట్ యార్డులో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను మరింత వేగవంతం చేస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అదనపు కలెక్టర్, పౌర సరఫరాల శాఖ మరియు మార్కెట్ అధికారులతో కూడా చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా గన్నీ సంచులు, ట్రాక్టర్లు, లారీలు వంటి అవసరమైన వనరులు సమృద్ధిగా అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాముల్లో భద్రపరిచి, వర్షాలు లేదా ఇతర కారణాలతో నష్టం జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని ఆకుల నరసన్న స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ప్రచారాలను నమ్మి అపోహలకు గురికావద్దని సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదు రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. రైతులకు అండగా నిలుస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.



## మున్సిపల్ కమిషనర్‌కు టిడిపి వినతి

### హైదరాబాద్ రోడ్డులోని ఎన్‌టీఆర్ విగ్రహం సుందరీకరణ, పరిశుభ్రత పనులు చేపట్టాలని విజ్ఞప్తి

**కరీంనగర్, మే25(నినాదం)**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు గారి 103వ జయంతి సందర్భంగా ఈ నెల 28న నిర్వహించనున్న కార్యక్రమాల దృష్ట్యా, హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సుందరీకరణ మరియు పరిశుభ్రత పనులు చేపట్టాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ (ఐఏఎస్) గారిని టిడిపి నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షులు వంచ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్ రావు, ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రవెల్లి రవీందర్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు సందబోయిన రాజేశం, నగర మాజీ అధ్యక్షులు రొడ్డ శ్రీధర్, మాజీ అధికార ప్రతినిధి లొంక భాస్కర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి

### కరీంనగర్‌లో ఘనంగా ప్రారంభమైన మహిళా వారోత్సవాలు



**కరీంనగర్, మే25(నినాదం)**

కరీంనగర్ నగరంలో మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మహిళా వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణంలోని కళాభారతి వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో "మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరయ్య ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా వారోత్సవాలను ప్రారంభించారు. పోషకాహార మిషన్‌లో భాగంగా మహిళలతో పోషకాహార నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వం అందించిన చీరలను మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు సంబంధించిన రూ.14.20 కోట్లు, రూ.19.24 లక్షల బ్యాంకు రుణాల జంబో చెక్కులను అందజేశారు. వంటల పోటీల్లో పాల్గొన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు స్మారక చిహ్నాలు ప్రదానం చేశారు. బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారుల సంరక్షణకు సంబంధించిన 1098, 181 టోల్ ఫ్రీ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళా వారోత్స వాల్లో చేపట్టనున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఆరోగ్య శిబిరాలను సందర్శించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు ఐదు రోజుల పాటు పోషకాహార అవగాహన కార్యక్రమాలు, వంటల పోటీలు, గర్భిణీలకు రక్తహీనత పరీక్షలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక సమావేశాలు, బాల్య వివాహాల నిర్మూలనపై చైతన్య కార్యక్రమాలు, కొత్త మహిళా సంఘాల ఏర్పాటు, మహిళల భద్రతపై అవగాహన, రుణ మేళాలు, అంగన్‌వాడీ-బడిబాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి కరీంనగర్‌ను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘ భవనాలు లేని ప్రాంతాల్లో త్వరలో కొత్త భవనాలు నిర్మిస్తామని తెలిపారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంద న్నారు. వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా మహిళలకు చేయూతనిస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. నగర పరిశుభ్రతలో మహిళలు భాగస్వాములు కావాలని కోరారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యంతోనే సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరుతున్నాయని అన్నారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్యం సమాజ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, పలువురు కార్పొరేటర్లు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# బాల్యం బలోపేతం అంగన్వాడీల లక్ష్యం

### కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి ప్రతినిధి, మే 25(నినాదం):** ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లలకు సమతుల్యమైన, పోషక విలువలు గల ఆహారం అందించి బాల్యాన్ని బలోపేతం చేయడం అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో తొలి రోజు సోమవారం ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "సే నో టు జంక్ ఫుడ్" అనే నినాదంతో ప్రత్యేక ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు మరియు ఇతర పోషకాహార పదార్థాలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శిస్తూ వాటి పోషక విలువలను వివరించారు. ఈ స్టాల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి వివిధ వంటకాల తయారీ విధానం, వాటి పోషక ప్రయోజనాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి – తెలంగాణ ప్రగతి అనే నినాదంతో నేటి నుండి ఈ నెల 30వ తేదీ వరకు మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు నాణ్యమైన, సమతుల్య ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బయట మార్కెట్లో లభించే జంక్ ఫుడ్‌ను చిన్నపిల్లలకు ఇవ్వకుండా, స్థానికంగా అందుబాటులో ఉన్న తాజా కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలు వంటి పోషకాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు ఈ దిశగా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళలు, చిన్నపిల్లల కోసం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలు, టీచర్లు మరియు పిల్లల తల్లిదండ్రుల కోసం వంటల పోటీలు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.




## కిశోర బాలికల హక్కులు సంరక్షణపై స్నేహ కార్యక్రమం




**అమరచింత, మే 25, (నినాదం):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల్లో సందర్భంగా మండల స్థాయిలో స్నేహ కిశోర బాలికల సమావేశం సోమవారం అమరచింత మునిసిపాలిటీ కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళల భద్రత పోషణ నాయకత్వం బాలికల హక్కులు చదువు అనే అంశంపై అమరచింత ఎస్సై స్వాతి, అంగన్వాడి సూపర్వైజర్ నర్మదా, శిశు సంక్షేమ జిల్లా అధికారి స్వరూప ప్రసంగించారు. మే 2 నుండి జూన్ 10 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం వెంకటప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, సిసి అన్వర్ పాషా, కిశోర బాలికలు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## హనుమకొండ నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా విష్ణు వర్ధన్ రెడ్డి ఎంపిక



**హన్మకొండ, మే25 (నినాదం):** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం హనుమకొండ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష ఎంపికలు జరిగాయి. రాష్ట్ర నెట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడి రామ్మోహన్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కైలాష్ యాదవ్ అబ్జర్వర్లుగా హాజరయ్యారు. ఈ ఎంపికలో హనుమకొండ జిల్లా నెట్ బాల అసోసియేషన్ అధ్యక్ష పదవికి డి. విష్ణు వర్ధన్ రెడ్డి , కార్యదర్శిగా సిహెచ్. సూర్య రావులు ఎంపికైనట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాప్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర నెట్ బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లిల్లీ ఫ్లోరెన్స్ మేడం, డి వై ఎస్ ఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వరం పరిష్కారం

### అదనపు కలెక్టర్ ఖిమ్య నాయక్



**వనపర్తి ప్రతినిధి, మే 25 (నినాదం) :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్య ప్రకాష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు లకు ఎప్పటికప్పుడు పరిష్కరించి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చి పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 53 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## పోషకాహారం పట్ల అవగాహన



**చింతపల్లి, మే25 (నినాదం) :** మహిళా వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం పోషకాహారం పట్ల అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సక్కుభాయి మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు అవగాహన కల్పించడానికి పోషక విలువలు కలిగిన పదార్థాలను కార్యాలయంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సుగుణ, మంజుల, అంజమ్మ, విజయలక్ష్మి, యశోద , వసంత, వైష్ణవి, ప్రసన్న, వివిధ గ్రామాల అంగన్వాడి ఉపాధ్యాయులు, కిశోర బాలికలు,తదితరులు పాల్గొన్నారు.

## రెండు ద్విచక్ర వాహనాల డీ

### ఇద్దరు మృతి ఒకరికి తీవ్ర గాయాలు



**మునగాల, మే 25 (నినాదం) :** రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బరాకతి గూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని సర్వీస్ రోడ్లో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్నటువంటి బారాకత్ గూడానికి చెందిన నారగాని వెంకట్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలైనట్లు వారి లో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మరో ద్విచక్ర వాహనం పైన ఉన్నటువంటి బేతవోలు గ్రామానికి చెందిన బత్తిని మణికంఠ మృతి చెందినట్లు తెలిసింది. ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా మరొక స్వల్పంగా గాయాలపాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎస్ ఐ రత్నం తెలిపారు.

## అక్రమ పట్టా మార్పిడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**కోదాడ,మే 25(నినాదం):** కోదాడ రెవెన్యూ పరిధిలో 615, 616 సర్వే నెంబర్లలో రెవెన్యూ అధికారులు అక్రమ పట్టా మార్పిడి చేశారని కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు.. తమకు న్యాయం జరగాలని రైతులు కలెక్టర్ ను అభ్యర్థించారు.. కాగా కలెక్టర్ సానుకూ లంగా స్పందించారని విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు వెల్లడించారు ఈకార్యక్రమంలో రైతులు పల్లా సీతారామాం జనేయులు వెంకయ్య గోవిందు నరేష్ విజయలక్ష్మి అశోక్వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

# బహిరంగ మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకోవాలి

### పార్టీలకు అతీతంగా రైతులకు మద్దతుగా నిలబడాలి

### తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** వ్యవసాయ భూముల విషయంలో బహిరంగ మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకొని, రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువను నిర్ణయించాలని, ధీనికి ప్రజా ప్రతినిధులు పార్టీల నాయకులు రైతులకు మద్దతుగా నిలబడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పూలం రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ఈనెల 28 నుంచి నూతన మార్కెట్ విలువ అందుబాటులోకి తీసుకు రానున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల విషయంలో బహిరంగ మార్కెట్ విలువకు రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన విలువకు మధ్య భారీగా వ్యత్యాసం ఉందని, దీనివలన ప్రభుత్వ అవసరాలకు , ప్రజా ప్రయోజనాలకు భూమి అవసరమైనప్పుడు భూమి సేకరించిన సందర్భంలో ఇదివరకు ఉన్న రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ ప్రకారం రైతులకు పరిహారం చెల్లించడం వల్ల చాలా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూముల మార్కెట్ విలువను పెంచేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లాలోని వ్యవసాయ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువను సవరించి బహిరంగ మార్కెట్ విలువను పరిగణలోకి తీసుకొని ఆ విలువ కనుగుణంగా రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువను నిర్ణయించాలని, ధరలను పెంచే బాధ్యత కూడా రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా కమిటీలకు అప్పగించినందున జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని,అధికారులను ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రస్తుతం చిన్న కాళేశ్వరం ఇరిగేషన్ కాలువల నిర్మాణం కోసం రైతుల నుండి భూములు సేకరిస్తున్న సందర్భంగా రైతులకు పరిహారం చెల్లించే విషయంలో నూతన మార్కెట్ విలువను అమలు చేస్తూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నాలుగు రెట్లు పరిహారం చెల్లించటంతో పాటు 100 శాతం సొలాటియం ఇవ్వాలని, లేనియెడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలి

### మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్






**పెబ్బేరు, మే25 (నినాదం):** విద్యార్థులు విద్యాభ్యాసంతోపాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమా ల్లోనూ ప్రతిభ కనబరిస్తేనే సమగ్ర వికాసం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక పీఎం శ్రీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహిం చిన 15 రోజుల సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ఎంఈఓ జయరాములతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థి నులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని చదువుతోపాటు ఆటలు, పాటలు, మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్, కరాటే తదితర అంశాల్లో శిక్షణ పొందడం అభినంద నీయమ న్నారు. ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలను అభ్యసించి విద్యార్థినులు ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఎంఈఓ జయరాములు మాట్లాడుతూ జిల్లాలోని 15 కేజీబీవీలకు చెందిన విద్యార్థినులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొని వివిధ రంగాల్లో మంచి ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. సమ్మర్ క్యాంప్ విజయవంతానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందిం చారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు శివసాయి, జమ్ములమ్మ, ఎఫ్ఏఓ ఉమాదేవి, జీసీఈఓ ఇందిరాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నర్సింహా గౌడ్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూముల మార్కెట్ విలువ నావీకరణను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలి

### కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, మే25 (నినాదం) :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం భూముల మార్కెట్ విలువల నవీకరణను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారంఉదయాదిత్య భవనంలో సబ్ రిస్ట్రార్లు, తహసిల్దార్ లు, ఎంపీడీవో లతో భూముల మార్కెట్ విలువల పై సమీక్ష నిర్వహించారు. జీవో నెం.41 ప్రకారం భూముల మార్కెట్ విలువల (మార్కెట్ వాల్యూ) నవీకరణ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అర్బన్, రూరల్ కేటగిరీలుగా విభజించి ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి 1, 2, 3, 4 ఫారమ్‌ల ఆధారంగా ప్రాంతాల వారీగా రహదారులు, మండల కేంద్రాలు, నియోజకవర్గ పరిధులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని భూముల విలువలను అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ విలువలను పరిశీలించి ఆర్డీవో స్థాయిలో అప్లోడ్ చేస్తున్నామని, అనంతరం మార్కెట్ విలువలను ఫైనల్ చేసి కమిటీ ఆమోదానికి పంపనున్నట్లు తెలిపారు. అర్బన్ కమిటీలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా ఉండగా, మున్సిపల్ కమిషనర్, జెడ్పీసీఈఓ, సబ్-రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. రూరల్ కమిటీలో ఆర్డీవో చైర్మన్‌గా, సబ్-రిజిస్ట్రార్, తహసీల్దార్, ఎంపీడీవో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు. నాన్-అగ్రికల్చర్ ఫిజికల్ కమిటీలలో ఫారమ్-1, 2లను, అగ్రికల్చర్ కమిటీలలో ఫారమ్-3, 4లను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల చట్టం ప్రకారం అన్ని వివరాలను సరిచూసుకుని నమోదు చేయాలని సూచించారు. అగ్రికల్చర్ భూములకు కనీస మార్కెట్ విలువ రూ.2.75 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు ఉండాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, మిర్యాలగూడ ఆర్డిఓ రమణారెడ్డి, దేవరకొండ ఆర్డిఓ ప్రియదర్శిని, సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు .

## శ్రీ లక్ష్మీనరసింహస్వామికి నిత్య కళ్యాణం



**హుజూర్ నగర్ (మఠంపల్లి) మే, 25 (నినాదం) :** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం, మట్టపల్లి మహాక్షేత్రం నందు సోమవారం శ్రీ స్వామి వారికి ప్రాతః కాలమున నిత్యాభిషేకములు, నిత్య హోమములు జరిగినవి. తదుపరి నిత్య కళ్యాణం దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయ చార్యులు వార్లచే శాస్త్రోతముగా నిర్వహించ బడినది. దేవాలయం అన్నదానంలో 110మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగినది.

## మహిళా శక్తి సొంత భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు

### కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడి




**వనపర్తి ప్రతినిధి, మే 25 (నినాదం) :** వనపర్తి జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 104 మహిళా శక్తి స్వంత భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, అన్నింటిని డిసెంబర్ లోపు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మే 25 నుండి 30 వరకు జరుగనున్న మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల మహిళా సమాఖ్య సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఒకేసారి రాష్ట్రంలోని 8000 మహిళా శక్తి స్వంత భవనాలకు వర్చువల్ గా భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేసే విధంగా చిలకపచ్చ రంగు చీరను ఆమోదించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని అన్నారు. అందుకే నేడు కొన్ని జిల్లాల్లో సోలార్ ప్లాంట్ లను, పెట్రోల్ బంక్ లు, మహిళా శక్తి భవనాలు, ఆర్టీసీ బస్సులను ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారం అందిస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకొని ప్రతి మండలంలో గోదాములు నిర్మించుకోవడం, రైస్ మిల్లులు ఏర్పాటు చేసుకోవడం, అన్ని జిల్లాల్లో పెట్రోల్ బంక్ లు, సోలార్ ప్లాంట్, సూపర్ మార్కెట్, లాజిస్టిక్ హబ్ లు నిర్మించుకోవాలని సూచించారు. 2034 నాటికి కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని మహిళా సమాఖ్య సభ్యులతో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 356 మహిళా సంఘాలు ఉన్నాయని, వాటిలో 91 మహిళా సంఘాలకు స్వంత భవనాలు ఉన్నట్లు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా ఇప్పుడు 104 స్వంత భవనాలు మంజూరు అయ్యాయని, మరో 55 భవనాలు మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలియజేశారు. మిగిలిన 94 సంఘాలకు స్థల పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. 104 మహిళా సంఘాల భవనాలు త్వరగా పనులు ప్రారంభించి డిసెంబర్ లోపు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో మహిళా సంఘాల మొండి బకాయిలు కేవలం ఒక శాతం మాత్రమే ఉందని, అదికూడా త్వరలో చెల్లించి జీరో ఎన్.పి.ఎ గా జిల్లాను తీర్చిదిద్దుతామని తెలియజేశారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్య నాయక్, డిఆర్డిఓ పిడి ఉమాదేవి, మహిళా సంఘాల మండల అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# తండ్రిని చంపినందుకే ప్రతీకారంగా హత్య

### 2021 లో హత్యకు ప్రయత్నించి విఫలం

### 24 గంటల్లోనే కేసులు చేదించిన జిల్లా పోలీసులు

### ఐదుగురు నిందితుల అరెస్టు పరారీలో మహిళ

### వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ కే.నరసింహ





**సూర్యాపేట ప్రతినిధి ఏప్రిల్ 25 (నినాదం) :** సూర్యాపేట పట్టణంలో కలకలం సృష్టించిన టిఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు హత్య కేసును 24 గంటల్లోనే జిల్లా పోలీసులు చేదించారు . జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కే నరసింహ డివిజన్ డీఎస్పి ప్రసన్నకుమార్ తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడిన పోలీసులు సూర్యాపేట రూరల్ పరిధి టేకుమట్ల గ్రామం వద్ద జాతీయ రహదారి 65 ఖమ్మం హైవే టీ జంక్షన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఏ వన్ నిందితుడు మిద్దె జీవన్ జీవన్ ఏ ఫోర్ నిందితుడు మిద్దె ఆనంద్ లను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు నిజాలను ఒప్పుకున్నట్లు తెలిపారు .2007 సంవత్సరంలో ఏ వన్ నిందితుడు మిద్దె జీవన్ తండ్రి మిద్దె రవీందర్ ను చింతలపాటి మధు హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు తన తండ్రిని హత్య చేసిన వ్యక్తిని ఎలాగైనా చంపి ప్రతీకారం తీర్చుకోవాలన్న ప్రతీకారంతో రగిలిపోతున్న జీవన్ రామన్నగూడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చింత సైదులు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న మేదరి ప్రసాద్ తన దూరపు బంధువైన మిద్దె ఆనంద్ అదేవిధంగా చింత సైదులు భార్య ములకలపల్లి భవాని తో కలిసి పక్క ప్రణాళిక చేసి హత్య చేశారు . నిందితుడు జీవన్ చింత సైదులు మేదరి ప్రసాద్ లను పరిచయం చేసుకుని పలుమార్లు మద్యం సేవిస్తూ తన తండ్రిని చంపిన మధును ఎలాగైనా చంపాలని పలుమార్లు ప్రస్తావించేవాడని అంగీకరించారు. తనకు సహకరిస్తే సుఫారీ ఇస్తానని తెలిపి , మొదటగా మధు ఒంటరిగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ఉండేవాడని అదును చూసి కారుతో ఢీ కొట్టి చంపుదామని ప్రయత్నించారని అదేవిధంగా 2021లో మధు ను నెమికల్ ఫంక్షన్ హాల్ వద్ద హత్య చేయాలని ప్రయత్నించగా కుదరకపోవడంతో ఏ2 నిందితుడు సైదులు ను సూర్యాపేట తాళ్లగడ్డలో ఇల్లు అద్దెకు తీసుకోమని కిరాయి సైతం నిందితుడు జీవన్ చెల్లించేవాడని తెలిపారు . శుక్రవారం మధ్యాహ్నం చేపలు మద్యం తీసుకువచ్చామని తెలిపి సైదులు ప్రసాద్ మృతుడు మధు ముగ్గురు కలిసి దావత్ చేసుకొనగా మద్యం మత్తులో ఉన్న మధును హత్య చేయడానికి పథకం ప్రకారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద వేచి చూస్తున్న జీవన్, ఆనంద్ లకు ఫోన్ చేసి రమ్మని తెలుపగా సుమారు 7:30 గంటల సమయంలో మద్య మత్తులో ఉన్న మధును ప్రసాద్ కాళ్లు చేతులు నొక్కి పట్టుకోగా మటన్ కొట్టే కత్తితో సైదులు మధు మెడ ముఖం భుజంపై తీవ్రంగా దాడి చేసి హతమార్చి గోనె బస్తాలో మధు శవాన్ని కుక్కి ఎల్కారం గ్రామ శివారు రోడ్డు కల్వర్టు కింద పడవేశారని ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న సైదులు భార్య భవాని కోసం వెతుకుతున్నామని త్వరలో ఆమెను అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. కేసులో అద్భుతంగా పనిచేసిన రూరల్ సిఐ రాజశేఖర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఎస్ఐలు ఏడుకొండలు శివతేజ, మహేందర్ నాథ్ ,బాలునాయక్, సిబ్బందిని అభినందించారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి,

### హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ, మే25 (నినాదం):** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తూ ప్రజలు 248 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్ రవికి అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాస్, ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్డీవో మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# కార్బైడ్‌తో మగ్గిన మామిడి.. జర భద్రం మరి

### ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

### జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా మామిడి గోదాములు

### పట్టించుకోని సంబంధిత అధికారులు

**నాగర్ కర్నూల్ మే 25 (నినాదం)**

సహజంగా మామిడి పండ్లు అంటేనే అందరికీ మక్కువ ఎక్కువే ఆ పేరు వింటేనే నోరూరిపోతుంది పైగా సీజనల్ పండ్లు తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు ఆరోగ్య నిపుణులు సూచిస్తుంటారు. కానీ అందుకు భిన్నంగా కొందరు వ్యక్తులు ధనార్జనే ధ్యేయంగా మామిడి పండ్లను కార్బైట్ తో మగ్గించి నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రజలకు అంటగడుతున్నారు అవి తిన్న ప్రజల ఆరోగ్యం భద్రమేనా. అనే సందేహాలు కలుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలలో గోదాములు లీజుకు తీసుకొని గ్రామాల నుండి మామిడికాయలను తీసుకువచ్చి గోదాముల్లో నిలువ చేసి (కార్బైట్) రసాయనలను ఉపయోగించి బలవంతంగా మగ్గించే దందా జోరుగా సాగుతుంది. రసాయనాల ద్వారా బలవంతంగా మగ్గించిన మామిడి పండ్లను తినడం వలన ప్రజల ఆరోగ్యానికి హానికరమని తెలిసికూడా కొందరు వ్యక్తులు తమ సొంత లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధిక లాభాల కోసం ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి గోదాముల్లో రసాయనాల ద్వారా విచ్చలవిడిగా మామిడి పండ్లను మగ్గిస్తున్నారని పలువురు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు జిల్లా కేంద్రంలో ఇంత జరుగుతున్న తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం వచ్చిందంటే చాలు మార్కెట్లో మామిడి పండ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ అవకాశాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు సహజ పద్ధతులను పక్కనపెట్టి రసాయనాల ద్వారా మామిడి పండ్లను తక్కువ సమయంలోనే మగ్గబెడుతున్నారు. ముఖ్యంగా కార్బైట్ రసాయనాల ద్వారా వెలువడే వాయువు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రసాయనల ద్వారా మగ్గిన మామిడి పండ్లను తినడం వల్ల కడుపు నొప్పి వాంతులు విరేచనాలు తలనొప్పి శ్వాసకోస సమస్యలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలుపుతున్నారు. జిల్లా కేంద్రంలో పలు కాలనీలలో రహస్యంగా గోదాముల్లో మామిడి పెట్టెల మధ్య కార్బైట్ ప్యాకెట్లు ఉంచి మామిడి పండ్లను రాత్రింబవళ్లు అని తేడా లేకుండా మగ్గిస్తున్నారు. ఇంతవరకు ఆహార భద్రత శాఖ మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ధనార్జన ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి వారిపై వెంటనే తనిఖీలు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# భారీ వర్షానికి నేలకొరిగిన చెట్లు విద్యుత్ స్తంభాలు

### అధికారులతో పరిశీలించిన స్థానిక సర్పంచ్

**కల్వకుర్తి మే 26 (నినాదం)**

వెల్దండ మండల కేంద్రంలో బీసీ హాస్టల్ దగ్గర సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి భారీ వృక్షాలు నేలకొరిగాయని విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అక్కడే ఉండి రోడ్డు మీద పడ్డ భారీ వృక్షాలను తీసివేసి, నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిని సరి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మసిగుడ్ల వెంకటేష్ , మట్ట భరత్ గౌడ్ చిమ్ముల తిరుపతి రెడ్డి, మావిళ్ల రాజు, మట్ట నిరంజన్, విద్యుత్ సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు,



# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

## బీజేపీపై కేటీఆర్, హరీష్ రావు, జీవన్ రెడ్డిలు ఎందుకు మాట్లాడంలేదు..?

### ధాన్యం, మక్కజొన్నల కొనుగోలుపై కేంద్రం ఎందుకు స్పందించడం లేదు.. ?

### జగిత్యాల జిల్లా కేంద్రంలో పెట్రోల్ డీజిల్ ధర పెంపుపై నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి ఫైర్

**జగిత్యాల ప్రతినిధి మే 26 నినాదం**

ప్రభుత్వంపెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనె తగ్గించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పేద ప్రజల సంక్షేమం ఏనాడు పట్టించుకోవడంలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి మోడి పెట్రోల్, డీజిల్ ధరల విషయం మాట్లాడలేదని అన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు, కేరళ మరియు పచ్చిమబెంగాల్ ఎన్నికల పూర్తి అయిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మంత్రి ఆరోపించారు.






కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వం దేశ ప్రజలు ఎవ్వరు విలాసవంతాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిందని దీని అర్ధం మన దేశ ఆర్ధిక వ్యవస్థ అస్థవ్యస్తంగా మారిందని భావించవచ్చని మంత్రి అడ్లూరి అన్నారు. రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతున్న మోడి మాత్రం నిద్ర లేవడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగాఉన్న బీఆర్ఎస్ పార్టీ నరేంద్ర మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, జీవన్రెడ్డిలు ఎందుకు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడం లేదని మంత్రి ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు బండి భగీరథ్ అంశంపై ఎందుకు బీఆర్ఎస్ నాయకులు నోరు మెదపడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్కటేనని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మీద ఉన్న దృష్టి ధాన్యం కొనుగోలు, మక్కల కొనుగోలుపై లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పంటల వడ్లు కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న ఎఫ్ సీ ఐ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం సేకరించడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మిగిలిన లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు తగ్గించాలని రాష్ట్రంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన మక్కలతో పాటు ఎఫ్ సీ ఐ ద్వార బియ్యం సేకరించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జగిత్యాల మున్సిపాల్ చైర్మన్ సమిండ్ల వాణితో పాటు జగిత్యాల జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# పటాన్‌చెరు నియోజకవర్గంలో అమృతవనం ఎకో ఫారెస్ట్ పార్క్

### ప్రారంభించిన మంత్రి కొండ సురేఖ








**పటాన్చెరు, మే25 (నినాదం)**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొంతపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అమృతవనం ఎకో ఫారెస్ట్ పార్క్ మరియు మంబాపూర్ గ్రామంలోని హరిత ద్వారం ఫారెస్ట్ పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ మరియు అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండ సురేఖ ముఖ్య అతిథిగా హాజరై పార్కులను ప్రారంభించారు.ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రి వర్యులతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



# కేన్ ఫెస్టివల్‌లో మెరిసిన ఐశ్వర్య

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ తన ఫ్యాషన్ లుక్ తో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిశారు. తన కుమార్తె ఆరాధ్యతో కలిసి రెడ్ కార్పెట్‌పై హొయలొలికించారు. అయితే, ఐశ్వర్య లుక్ పై నెట్టింట కొన్ని విమర్శలు ఎదురవుతున్నాయి. వీటిపై ఐష్ స్పందించనప్పటికీ.. నటి కంగనా రనౌత్ ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఐశ్వర్య ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన కంగన అద్భుతంగా ఉన్నారని ప్రశంసించారు. 'ఫ్యాషన్, స్టైల్ అనేది ఎవరికి నచ్చినట్లు వారు ఎంపిక చేసుకునేవి. వారి ఇష్టానికి, సౌకర్యానికి తగినట్లు ఉంటాయి. ఈ విషయంలో ఏ మహిళ కూడా ఎవరికీ ఎటువంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. కేన్స్‌లో ఐశ్వర్య అద్భుతంగా ఉన్నారు. ఆమెను మరేదైనా స్టైల్‌లో చూడాలనుకునే వారు మొదట మీ దగ్గర ఏముందో ప్రపంచానికి చూపించవచ్చు కదా.. అయినా.. రెడ్‌కార్పెట్‌పై ఎపుడూ యువ నటీమణులే ఉండరు. ఇలా 50 ఏళ్లలో ఉన్నవారు కూడా మెరుస్తారు. వారిని చూడడం మీకు అలవాటు లేకపోతే ఇకనైనా అలవాటు చేసుకోండని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చారు. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో మే 12 నుంచి 23 వరకూ సందడిగా జరిగింది. ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ ప్రత్యేకంగా రూపొందించిన 'లుమినారా' అనే డీప్ సెర్–బ్లూ గౌన్‌లో ఐశ్వర్య రెడ్ కార్పెట్‌పై నడిచి అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేశారు. రెండోరోజు వైట్ డ్రెస్‌తో ఫొటోలకు పోజులిచ్చారు.

NINADAM CINEMA

# లక్కీ ఛార్మ్ త్రిష

### ముగ్గురు హీరోలకు బ్లాక్ బస్టర్లు

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో 'త్రిష లక్కీ ఛార్మ్' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. 'వారి బ్లాక్ బేస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజరుతో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజరు కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బిగెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్ప' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను 'లక్కీ ఛార్మ్' అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది.




# పర్సెంటేజీల కోసం ఎగ్జిబిటర్ల ఆందోళన

### రంగంలోకి దిగిన మెగాస్టార్ చిరంజీవి

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గత కొన్ని రోజులుగా నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. కలెక్షన్లలో వాటా పద్ధతి అయిన 'పర్సంటేజ్ సిస్టమ్' అంశంపై రెండు వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, పరిశ్రమలో పెద్దదిక్కుగా భావించే మెగాస్టార్ చిరంజీవి ఈ సమస్య పరిష్కారానికి స్వయంగా ముందుకు వచ్చారు. తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు చిరంజీవిని ఆయన నివాసంలో కలవనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మల్టీప్లెక్సలలో కలెక్షన్ల ఆధారంగా పర్సంటేజ్ షేరింగ్ విధానం అమలులో ఉంది. అయితే సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో మాత్రం పాత ఫిక్సడ్ రెంటల్ పద్ధతినే కొనసాగిస్తున్నారని ఎగ్జిబిటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, విద్యుత్ ఛార్జీల పెరుగుదల, నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి క్లిష్టంగా మారిందని వారు చెబుతున్నారు. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఒకే స్థిర అద్దె చెల్లించాల్సి రావడం తమపై తీవ్ర ఆర్థిక భారం పెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# రామాయణ్‌కు హన్స్ జిమ్మర్ సంగీతం అదనపు ఆకర్షణ

హిందీలో తెరకెక్కుతున్న ఇతిహాసం 'రామాయణ్'పై సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అద్భుత కావ్యం ఇండియాకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకుంటుందని ఏఆర్ రెహమాన్ అన్నారు. దాదాపు 4000 కోట్ల బడ్జెట్‌తో నమిత్ మల్హోత్ర ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ గొప్ప ఇతిహాసం గురించి ప్రపంచానికి తెలియాలన్నదే నిర్మాతగా ఆయన ఆకాంక్ష. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్‌తోపాటు హాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్ కూడా పని చేస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787